నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
1
శనివారం | 21 అక్టోబర్ 2023 | www.navatelangana.com

ముబారస్‌పూర్‌లో నగదు పట్టివేత

నవ తెలంగాణ దౌల్తాబాద్



ఫ్లయింగ్ కార్డు బృందం గురువారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామ సమీపంలో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.2.72 లక్షలు లభ్యమయ్యాయని బృందం తెలిపారు. వారిని విచారణ చేయగా మండల పరిధిలోని రేణుకా మాత వైన్స్ దొమ్మాట యజమాని దయానంద రెడ్డి నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. వాహనాలలో డబ్బులు తెచ్చుకునేవారు పూర్తిగా సంబంధిత పత్రాలను ఉండాలన్నారు. డబ్బులకు పూర్తి వివరాలు చూపించిన పక్షంలో వాహనాలను డబ్బులను సీజ్ చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు పాల్గొన్నారు.

అనస్థీషియ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ దామోదర్ ఎన్నిక

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట జిల్లా అనస్థీషియ విభాగ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ దామోదర్‌ను ఎన్నుకయ్యారు. జిల్లా అనస్తీసీయా (మత్తు) వైద్యుల సంఘం నూతన కార్యవర్గాన్ని సిద్దిపేట ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ కార్యదర్శిగా డాక్టర్ అనుపమ ప్రియదర్శిని, కోశాదికారిగా డాక్టర్ కాచం జగదీశ్వర్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ చందు, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ దేవేందర్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ సురేష్, డాక్టర్ వీణలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సమాజంలో మత్తు వైద్యుల ప్రాత చాలా కీలకమైనది అన్నారు. సీపీఆర్ పైన ప్రజలకు అవగహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. మత్తు వైద్యుల సంఘం వలన సిద్దిపేట మత్తు వైద్యులందరికి ఉపయోగకరంగా ఉంటుందని జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భీమేశ్వర్ తెలిపారు. ఎన్నికైన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.

బీఆర్ఎస్‌లో చల్లారిన అసమ్మతి

- బీఆర్ఎస్‌లో చేరిన టీఎన్జీఓ అధ్యక్షులు రాజేందర్
- ముదిరాజ్ ఓట్లు చేజారకుండా జాగ్రతలు
- మెత్తపడ్డ పట్నం మాణిక్యం
- ఫలించిన మంత్రి హరీశ్‌రావు దౌత్యం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్‌లో అసమ్మతి సెగలు చల్లారుతున్నాయి. ఒక్కొక్కర్ని మచ్చిక చేసుకునే పనిలో మంత్రి హరీశ్‌రావు సఫలీకృతమవుతున్నారు. ముఖ్యంగా ముదిరాజ్ సామాజిక వర్గం దూరమవుతుందన్న భావన పోగొట్టేందుకు తెగ ప్రయత్నం చేస్తున్నారు. సంగారెడ్డిలో అసమ్మతి గళం వినిపిస్తూ పోటీకి సిద్ధమైన డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం క్రమంగా సల్లబడుతున్నారు. హరీశ్‌రావు డైరెక్షన్‌లో అడుగులేస్తున్న పట్నం మాణిక్యం శుక్రవారం మంత్రి ఫోన్ చేసి చెప్పడంతో హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. పట్నం మాణిక్యం బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్‌కు మద్దతిచ్చేలా పరిస్థితుల్ని చక్కదిద్దుకుంటున్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న రాజేందర్ ఉద్యోగ విరమణ చేసి బీఆర్ఎస్‌లో చేరారు. సంగారెడ్డికి చెందిన రాజేందర్ బీఆర్ఎస్‌లో చేరడం, పట్నం మాణిక్యం పార్టీలోనే ఉండేలా చేసుకోవడం ద్వారా ముదిరాజ్‌ల ఓట్లు దూరం కాకుండా బీఆర్ఎస్ అధిష్టానం జాగ్రతలు తీసుకుంటుంది.

మెత్తబడ్డ పట్నం మాణిక్యం

ఉమ్మడి మెదక్ జిల్లా సహకార బ్యాంకు వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులుగా ఉన్న పట్నం మాణిక్యం మెత్తబడ్డారు. బీఆర్ఎస్ నుంచి సంగారెడ్డి టికెట్ ఆశించిన పట్నం మాణిక్యం ప్రత్యేకంగా ఒక గ్రూపును నడుపుతూ వచ్చారు. పట్నం ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహకంర అందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాల ద్వారా నియోజకవర్గమంతటా పర్యటించారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మాణిక్యంకు కాకుండా బీఆర్ఎస్ టికెట్ మాజీ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్‌కు ప్రకటించారు. పార్టీ నుంచి ఒక వ్యక్తికి టికెట్ ఇస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించిన తర్వాత కూడా మాణిక్యం తన పుట్టిన రోజున నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ బీఆర్ఎస్ టికెట్ తనకే వస్తుంది, నేనే బీఆర్ఎస్ అభ్యర్థినంటూ ప్రకటించుకున్నారు. ఆ ప్రకటనతో హరీశ్‌రావు మాణిక్యం పుట్టిన రోజు కార్యక్రమానికి రాకుండా ఆగిపోయారు. పార్టీ పరంగా మాణిక్యం ప్రకటనపై సీరియస్‌గా చర్చ జరిగింది. బీఫాం ఇచ్చే ముందు కూడా మాణిక్యం తనకే టికెట్ వస్తుంటంటూ చెబుతూ వచ్చారు. ఇటీవల చింత ప్రభాకర్‌కు బీఫామ్ ఇచ్చిన నేపథ్యంలో కూడా బీఆర్ఎస్ సీనియర్లలో పట్నం మాణిక్యం తన నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తమ కార్యాచరణ ఏమిటో ప్రకటిస్తామని ఆ రోజు అన్నారు. ఆ తర్వాత పెద్దగా మాణిక్యం కార్యక్రమాల్లో కనిపించడంలేదు. భవాణీ మాతా మాల వేసి కొంత కాలం ప్రత్యేక కార్యక్రమాలు చేయలేదు. మహారాష్ట్రకు పోయి మాల తీశారు. శుక్రవారం మంత్రి హరీశ్ రావు పట్నం మాణిక్యంకు ఫోన్ చేశారు. హైదరాబాద్‌కు రావాలని కోరారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన రాజేందర్ బీఆర్ఎస్‌లో చేరే కార్యక్రమానికి మాణిక్యంను కూడా రమ్మని కోరడంతో మంత్రి పిలుపు మేరకు వెళ్లారు. బీఆర్ఎస్‌లో చేరే కార్యక్రమానికి హాజరైన పట్నం మాణిక్యం క్రమంగా మెత్తబడినట్లుగా బావించాలి. పార్టీ పరంగా బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్‌కు సహకరించేందుకు సిద్ధపడుతున్నట్లు చెబుతున్నారు.

రాజేందర్ చేరికతో ముదిరాజ్ ఓట్లపై ప్రభావం

టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న రాజేందర్ ఉద్యోగానికి రాజీనామా చేసి వీఆర్ఎస్ తీసుకున్నారు. ఆయన చేసుకున్న దరఖాస్తు కూడా వెనువెంటనే ఆమోదం పొందడంతో ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. రాజేందర్ చేరడం ద్వారా ముదిరాజ్ సామాజిక వర్గం చేజారి పోకుండా బీఆర్ఎస్ చేసిన ప్రయత్నం ఏ మేరకు ఫలితమిస్తుందో చూడాలి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ముదిరాజ్ సామాజిక వర్గానికి బలమైన ఓటు బ్యాంకు ఉంది. పటాన్‌చెరు, సంగారెడ్డితో పాటు ఇతర నియోజకవర్గాల్లోనూ 30 శాతం వరకు ఉన్నట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ నుంచి సంగారెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్లు ఆశించిన ముదిరాజ్ నాయకులున్నారు. పటాన్‌చెరు నుంచి నీలం మధు తీవ్ర ప్రయత్నం చేసినా టికెట్ దక్కలేదు. దీంతో ఆయన పార్టీకి రాజీనామ చేసి రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించి పాదయాత్రకు దిగారు. సంగారెడ్డి టికెట్ కోసం ప్రయత్నించిన పులిమామిడి రాజు పార్టీని వీడి బీజేపీలో చేరారు.

డీసీసీ వైస్ చైర్మన్‌గా ఉన్న పట్నం మాణిక్యం కూడా చివరి వరకు ఆశపడ్డారు. దీంతో ముదిరాజులు బీఆర్ఎస్‌కు దూరమయ్యారనే చర్చ నడిచింది. దీన్ని అధిగమించేందుకు మంత్రి హరీశ్‌రావు ఆపరేషన్ ఆకర్ష్‌కు పనిచెప్పారు. రాజేందర్‌ను పార్టీలో చేర్చుకుని ఎన్నికల్లో తిప్పాలని చూస్తున్నారు. పట్నం మాణిక్యంను బుజ్జగిస్తున్నారు.

నీలం మధు పాదయాత్ర వాయిదా..?

బీఆర్ఎస్‌కు రాజీనామ చేసిన నీలం మధు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధం అంటూ ప్రకటించారు. ప్రజల్లోకి వెళ్లేందుకు నియోజకర్గమంతటా పర్యటించేలా పాదయాత్రకు దిగారు. శుక్రవారం కొనసాగిన పాదయాత్ర అనివార్యంగా వాయిదా పడింది. బతుకమ్మ, దసరా పండుగ ఉన్నందున పాదయాత్రను వాయిదా వేస్తున్నట్లు నీలం మధు అనుచరులు చెబుతున్నారు. అయితే ఆపరేషన్ బుజ్జగింపులు ఏమైనా ఉన్నాయా..? అనే చర్చ కూడా నడుస్తోంది. ముదిరాజ్‌ల ఓట్లు గంపగుత్తగా బీఆర్ఎస్ వైపే ఉండేందుకు ఆ వర్గానికి చెందిన నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. బీసీ డీ నుంచి బీసీ ఎ లో కలపాలనే డిమాండ్‌తో ముదిరాజ్ జేఏసీ పోరాడుతుంది. ప్రభుత్వ ం రాగానే చేస్తామని హామీ కూడా ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో నీలం మధును కూడా ఒప్పించే అవకాశంలేకపోలేదనే చర్చ నడుస్తోంది.

పోలింగ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్



పోలింగ్ సిబ్బందికి అన్ని అంశాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎన్నికల రిసోర్స్ పర్సన్స్ (మాస్టర్ ట్రైనీ) అధికారులకు ఎన్నికల నిబంధనలు, ఎన్నికల ప్రక్రియపై మూడు గంటల పాటు సుదీర్ఘంగా అవగాహన కల్పించినారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారన్నారు. ఎన్నికల పోలింగ్ విధులలో పాల్గొనే ప్రతి ఒక్క అధికారి వారికి కేటాయించిన విధులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉన్నప్పుడే విధులను సక్రమంగా నిర్వహించగలుగుతారని అన్నారు. విధి నిర్వహణలో ఎలాంటా పొరపాట్లు చేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో దసరా నుంచి నిర్వహించే ఎన్నికల పోలింగ్ సిబ్బంది కి శిక్షణ కార్యక్రమంలో ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలన్నారు.

ఫ్రీ అండ్ ఫేర్ ఎలెక్షన్స్ నిర్వాహణే ముఖ్య కర్తవ్యం

- జిల్లా ఎస్పీ సీహెచ్ రూపేష్

నవ తెలంగాణ-సంగారెడ్డి



ఫ్రీ అండ్ ఫేర్ ఎలెక్షన్స్ నిర్వాహణే తమ ముఖ్య కర్తవ్యమని జిల్లా ఎస్పీ సీహెచ్ రూపేష్ తెలిపారు. రానున్న జనరల్ ఎలక్షన్స్ దృష్ట్యా జిల్లా నలుమూలల సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి డబ్బు, మద్యం అక్రమ రవాణాను కట్టడి చేస్తామన్నారు. జిల్లా ప్రజలందరు ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలన్నారు. ఎవరూ ఇతర పార్టీలను, వ్యక్తులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయరాదన్నారు. జిల్లా ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా తమ విలువైన ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. యువతకు క్రికెట్ కిట్లను అందిస్తూ, ఓటర్లను మభ్యపెట్టి, ప్రలోభాలకు గురిచేసి బలవంతపు ఓటు వేయించడం వంటివి చేయరాదన్నారు. స్వాతంత్ర్య భారతదేశంలో ప్రతి ఒక్కరూ తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కు ఉందన్నారు. ప్రజల స్వేచ్ఛ ఓటుకు భంగం కలిగించకూడదని కోరారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎలక్షన్స్‌కు సంబంధించి తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియా గ్రూప్‌లలో పోస్ట్ చేస్తే ఎలక్షన్ నియమాల్ని ఉల్లంగించినట్లు అవుతుందన్నారు. అబద్దపు ప్రచారాలు చేయవద్దన్నారు. సోషల్ మీడియాలో ఫార్వర్డ్ మెసేజ్ పట్ల జాగ్రత్త వహించాలన్నారు.

అటవీ అధికారుల బెదిరింపులతో విఠల్‌నాయక్ ఆత్మహత్యా యత్నం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మల్లేశం

నవ తెలంగాణ హవేలి ఘనపూర్



పోడు భూమిలో సాగు చేసుకుంటున్న గిరిజన రైతును అటవీ శాఖ అధికారులు వేధించడంతో ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హవేలి ఘనపూర్ మండలం గంగపూర్ గ్రామ తండాకు చెందిన విఠల్‌నాయక్ మెదక్ జిల్లా కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కే మల్లేశం శుక్రవారం విఠల్‌నాయక్‌ను పరామర్శించారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ గిరిజన రైతు విఠల్‌నాయక్‌ను 18వ ఫారెస్ట్ అధికారులు అరెస్టు చేసి రెండు రోజులు అదుపులో తీసుకొని బెదిరించి ఒత్తిళ్లకు గురి చేశారని ఆరోపించారు. గంగాపూర్ బీట్ ఆఫీసర్ లక్ష్మణ్, మెదక్ రేంజ్ ఆఫీసర్ బెదిరింపులకు భయపడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడని ఆరోపించారు. విఠల్‌నాయక్ కు ప్రాణహాని జరుగుతే అటవీ శాఖ అధికారుల బాధ్యత వహించాల్సి వస్తుందని డిమాండ్ చేశారు. వైద్య ఖర్చులు ఫారెస్ట్ అధికారులే భరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరిజన సంఘం జిల్లా నాయకులు మాజీ ఎంపీటీసీ రావుజ నాయక్, రవి నాయక్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు నాగలి బహూకరణ

నవ తెలంగాణ కొండపాక



గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులతో శుక్రవారం రోజున మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు హాజరై మాట్లాడారు. అందరూ పార్టీ విజయం కోసం అందరూ సమష్టిగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర రైతుబంధు సమితి సభ్యులు దేవి రవీందర్ నాగలి అందజేశారు.

ఓటర్ జాబితా డౌన్లోడ్ తీసుకోండి

నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్



ఓటర్ జాబితాలో మీ పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు హెల్ప్ లైన్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని తెలుసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ తెలిపారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ జాబితా డౌన్లోడ్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు.

అడుగడుగునా ఎన్నికల ఉల్లంఘనలే..!

నవతెలంగాణ - ఝరాసంగం





ఝరాసంగం మండలంలో అడుగడుగునా అధికారులు ఎన్నికల నియమావళి కోడ్ ను ఉల్లంగిస్తున్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పుడు రాజకీయ నాయకులకు సంబంధించి ఎలాంటి పోస్టర్‌లు గాని, బ్యానర్లు గాని ఉండకూడదు. గ్రామాల్లో ఎన్నికల నియమావళి కోడ్‌ను ఉల్లంగిస్తున్నారు. మండల పరిధిలోని బోప్పన్‌పల్లి, బోరేగావ్, కుప్పనగర్ తో పాటు తదితర గ్రామాల్లో ఓ పార్టీకి సంబంధించిన పోస్టర్లు పది రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వాటిని తొలగించలేదు. గ్రామాల్లోనీ ప్రధాన రోడ్ల పక్కన ఉన్న ఇండ్లు, దుకణాల గోడలకు వాల్ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. మండల వ్యాప్తంగా 33 రెవెన్యు గ్రామాలు ఉన్నాయి. అందులో భాగంగానే ఎన్నికల సంఘం మొత్తం 49 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. మేజర్ గ్రామ పంచాయతీల్లో 3 చొప్పున, తక్కువ ఓటర్లు ఉన్న పంచాయతీల్లో 2 పోలింగ్ బూత్ కేంద్రాలు ఉన్నాయి. అధికారులు ఎన్నికల నియమావళి కోడ్ ను పాటించడం లేదని స్పష్టంగా తెలుస్తోంది.

పారదర్శకంగా ఎన్నికలు

- ఎన్నికల ఖర్చుపై పటిష్ట నిఘా
- రాజకీయ సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి పొందాలి
- జిల్లా సరిహద్దుల్లో 9 చెక్‌పోస్టులు
- రూ.16.40 కోట్ల నగదు సీజు...187 కేసుల మద్యం స్వాధీనం
- విలేకర్ల సమావేశంలో ఎన్నికల అధికారి డాక్టర్ శరత్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల్లో ఆయా పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులపై పటిష్టమైన నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేస్తున్నామన్నారు. మంచి ఓటరు జాబితాల్ని తయారు చేసేందుకు బీఎల్‌ఓలు, ఇతర అధికారుల కృషి చేశారన్నారు. 18 ఏళ్ల వాళ్లంతా ఓటర్లుగా నమోదు అయ్యేలా చూశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1355958 మంది ఓటర్లున్నారన్నారు. ఓటర్లు స్వేచ్ఛాయుతంగా ఓటు వేసేందుకు వీలుగా జిల్లాలో 1594 పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 389 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్, మంచినీళ్లు, టాయిలెట్స్‌తో పాటు వికలాంగులు, వృద్దుల కోసం ర్యాంపు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 1594 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అన్ని రకాల ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ నెల 9 షెడ్యూల్ వచ్చిన క్షణం నుంచే ప్రవర్తానా నియమావళి అమల్లోకి వచ్చినందున జిల్లాలో ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌తో పాటు వివిద రకాల టీమ్స్ పనిచేస్తున్నాయన్నారు. ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీలు వేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో పోలీస్ శాఖ ద్వారా కోటీ 61 లక్షల74 వేలా 400 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఇన్‌కం టాక్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా మరో రూ.14.80 కోట్ల నగదును సీజ్ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.16.40 కోట్ల మేరకు నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో నిరంతరం నిఘా కోసం సరిహద్ద ప్రాంతాల్లో 9 చెక్‌పోస్టుల్ని ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంను పరిశీలించడంతో పాటు ఓటింగ్ విధానం, వీవీప్యాడ్ స్లిప్స్‌ల పనివిధానాన్ని ప్రదర్శించడం జరిగిందన్నారు. జిల్లాలో ఓటర్లు సంఖ్యను పెంచేందుకు మంచి ప్రయత్నం జరిగిందన్నారు. పారిశ్రామిక వాడలు, కాలనీలు, అపార్ట్‌మెంట్స్, కళాశాలల్లో ఓట్ల నమోదుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఓట్ల నమోదు పెరిగిందన్నారు. అదే విధంగా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అవగహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందికి ప్రవర్తనా నియమావళి గురించి దశదిశ నిర్దేశించినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు.

సరిహద్దుల్లో పహరా: ఎస్పీ సీహెచ్ రూపేష్

ఎన్నికల్లో పటిష్ట బందోస్తుతో పాటు డబ్బు, మద్యం, నగలు ఇతర వస్తువుల రవాణాను అరికట్టేందుకు జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో పహరా కాస్తున్నట్లు జిల్లా ఎస్పీ సీహెచ్ రూపేష్ అన్నారు. జిల్లాలో ఇప్పటికే కోటీ 63 లక్షల నగదును సీజ్ చేశామన్నారు. 187 కేసులు సుమారు 2403 లీటర్ల మద్యాన్ని స్వాధినం చేసుకున్నామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీ షీటర్లు, కమ్యూనినల్ షీటర్లను ఎన్నికల నేపథ్యంలో బైండోవర్ చేశామన్నారు. 1219 మందిని వివిద సెక్షన్ల కింద బైండోవర్ చేశామని, మరో వెయ్యి మందిని కూడా త్వరలో బైండోవర్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల్లో 9 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు తనిఖీలు చేస్తున్నామన్నారు. చెక్‌పోస్టుల్లో సీసీ టీవీలు పెట్టి కలెక్టర్, ఎస్పీ నేరుగా పర్యవేక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మద్యం, డబ్బులు, బంగారం, ఆయుధాల రవాణాతో పాటు బెదిరింపులు, ప్రలోభాలకు గురిచేయడం, రెచ్చగొట్టడం, అల్లర్లు సృష్టించడం కోసం ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే 24 మంది లైసెన్స్ ఉన్న ఆయుధాలను పోలీస్ స్టేషన్లలో అప్పజెప్పారన్నారు. మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులపై నిఘా పెట్టి ఇప్పటికే 182 కేసులు పెట్టామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, డీఆర్ఓ నగేష్, ఎఎస్పీ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

దసరా పండుగ బోనస్ కార్మికులందరికీ ఇవ్వాలి

మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులందరికీ పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వడంతో పాటు అందరికీ దసరా బోనస్ ఇవ్వాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. యాదగిరి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి ఎదుట శుక్రవారం దాదాపు 5 గంటల పాటు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అధికారుల హామీతో నిరసన విరమించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పేషంట్ కేర్, వానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డ్స్ చాలా సమస్యలతో బాధపడుతున్నారు. కార్మికులను కాంట్రాక్టర్ చాలా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనాలు చెల్లించకుండా తక్కువ చెల్లిస్తున్నారన్నారు. అన్ని హాస్పిటల్స్‌లో ప్రభుత్వం నిర్ణయించిన రూ.15,600లలో కార్మికుడికి రూ.12,093 చెల్లించి.. మిగిలినవి పిఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో జమ చేయాల్సి ఉందన్నారు. కానీ కాంట్రాక్ట్ సంస్థలన్నీ కుమ్మక్కై రాష్ట్రవ్యాప్తంగా రూ.10,500లు, రూ.11,000లు మాత్రమే చెలిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారరన్నారు. లక్షల రూపాయలు కార్మికుల డబ్బు కాజేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం చెల్లించే విధంగా హాస్పిటల్స్ అధికారులకు, కాంట్రాక్టర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికులపై కాంట్రాక్టర్ల వేధింపులు అరకట్టాలన్నారు. ఐడి కార్డు, యూనిఫాం, బ్లౌజులు, షఉస్, ఇతర పరికరాలు సరిపడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాట నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, యాదయ్య, శ్రీకాంత్, కిరణ్, శోభ, మరియమ్మ, అలీమా రత్నయ్య, సునీత, అనిత, నిఖిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ లోకల్ అభ్యర్థినే ఆశీర్వదించండి

నవతెలంగాణ-ఝరాసంగం



ఝరాసంగం ముద్దుబిడ్డను.. మరోసారి రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరోసారి అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నేతత్వంలో అన్ని వర్గాల వారికి సమ ప్రాధాన్యం కల్పిస్తున్నారని అందుకు భారీ మెజార్టీతో తమను గెలిపించాలన్నారు. నియోజకవర్గ అభివద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్సీడీసీ వై.నరోత్తం, డీసీఎంహెచ్ చైర్మెన్ శివకుమార్, రాష్ట్ర బేవరేజెస్ మాజీ చైర్మెన్ దేవీ ప్రసాద్, సీడీసీ చైర్మెన్ ఉమాకాంత్ పాటిల్, మండలాధ్యక్షులు వెంకటేశం, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బి.జగదీశ్వర్, సొసైటీ చైర్మెన్ గౌసొద్దిన్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు అజీజ్, నాయకులు బి సంగమేశ్వర్, సంతోష్ కుమార్, విజేందర్ రెడ్డి, ఎజాస్ బాబా,నరేష్, బస్వరాజు ఆయ గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలి

ఎన్నికల ఖర్చులపై పటిష్ట నిఘా

రాజకీయ సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి పొందాలి

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పొలిటికల్ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ శరత్ అన్నారు. కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు నడుచుకోవాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు లౌడ్ స్పీకర్ల అనుమతి, సభలు, సమావేశాలు, ర్యాలీలకు, వాహనాలకు ముందస్తు అనుమతి పొందాలని, సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో తప్పనిసరి గా అనుమతి తీసుకోవాలన్నారు. అభ్యర్థి తన ఎన్నికల ఖర్చుల కోసం ప్రత్యేకంగా బ్యాంక్ అకౌంటును ఓపెన్ చేయాలని, నామినేషన్ సమయంలో రిటర్నింగ్ అధికారికి అట్టి వివరాలు అందజేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థి తన ఎన్నికల ఖర్చుకు సంబంధించి రిజిస్టర్ ను నిర్వహించాలన్నారు. విద్వేషాలను పెంచే విధంగా, వ్యక్తిగత విమర్శలు చేయరాదన్నారు. ఓటర్లను మద్యం, డబ్బు,విలువైన వస్తువులు, తదితర ప్రలోభాలకు గురిచేయొద్దన్నారరు. అభ్యర్థి ప్రతిరోజు రూ.10 వేల నగదుకు మించి చెల్లింపు చేయరాదని, చెక్కులు, ఆర్టిజిఎస్ ద్వారా, ఆన్లైన్ ట్రాన్సాక్షన్స్ మాత్రమే చేయాలని సూచించారు. దేవాలయాలు, మజీదులు, చర్చిల వద్ద ప్రచారం చేయొద్దని స్పష్టం చేశారు. ఓటర్లను రవాణా చేయకూడదని, స్లొగన్స్ బ్యానర్లు, పోస్టర్లు అంటించడం లాంటివాటికి ప్రైవేట్ భవనాలు, భూములను వాడుకునే ముందు సంబంధిత యజమాని అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశాలు నిర్వహించుకునేటప్పుడు పోలీస్ శాఖ వారికి తెలియజేస్తే.. ఎలాంటి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉంటుందన్నారు. లౌడ్ స్పీకర్లకు ఉదయం ఆరు నుండి రాత్రి పది గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పొలిటికల్ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, డీఆర్ఓ నగేష్, రిటర్నింగ్ అధికారులు,గుర్తింపు పొందిన పొలిటికల్ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివద్ధిని చూసి ఓట్లు వేయండి : ఎమ్మెల్యే మాణిక్‌రావు

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలను చూసి మూడోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్ పట్టణంలోనీ బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. రెండుసార్లు అధికారంలో ఉండి స్థానికంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేశానన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి కోట్లాది రూపాయలను మంజూరు చేయించి, అభివద్ధి చేశానన్నారు. కాబట్టి మరింత అభివృద్ధి జరగాలంటే తనను మూడోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్‌లో అడ్రస్ లేని వ్యక్తులు వచ్చి ఓట్లు దండుకొని ఇక్కడి ప్రాంతాన్ని దోచుకుపోవడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన గీతారెడ్డి కూడా ఏమాత్రం అభివృద్ధి చేసిందో ప్రజలందరికీ తెలుసునన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో దళితుల్లో ఎంతోమంది మేధావులు ఉన్నప్పటికీ వారందరినీ అణగదొక్కి ఇక్కడ ఉన్న దొరలు వారికి అనుకూలమైన ఇతర ప్రాంతాలకు చెందిన వారిని వలస తీసుకువచ్చి జహీరాబాద్ ప్రజలపై రుద్దడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీఎస్ ఐడీసీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నరోత్తం, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ దేవీ ప్రసాద్, డీసీఎంఎస్ చైర్మెన్ మల్కాపూర్ శివకుమార్‌లు మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గంలో గత తొమ్మిదేండ్లలో ఎన్నో కోట్ల అభివద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. కేవలం ఒక పట్టణంలోనే రూ.93 కోట్లతో వివిధ అభివద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఈ సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మెన్ పెంటారెడ్డి, బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యులు శంకర్ నాయక్, మాజీ జెడ్పీటీసీ మాణిక్యమ్మ, ఝరాసంగం జెడ్పీటీసీ వెన్నెల నరేష్, మంజుల వెంకట్, రమాదేవి, తట్టు నారాయణ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల ఫస్ట్ ర్యాండనైజేషన్ ప్రక్రియ పూర్తి

నవతెలంగాణ-సంగారెడ్డి



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది సమక్షంలో పూర్తి ఆన్లైన్ విధానం ద్వారా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్స్‌ల కేటాయింపు (రాండమైజేషన్ ప్రక్రియ) పూర్తి అయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిదుల సమక్షంలో ఆన్లైన్ ద్వారా కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల మొదటి రాండమైజేషన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్ (ఈవీఎం) బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్, కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. 3,175 బ్యాలెట్ యూనిట్లు, 2,459 కంట్రోల్ యూనిట్లు, 2,465 వీవీ ప్యాట్స్ ను అసెంబ్లీ నియోజకవర్గం వారీగా కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్ఓ నగేష్, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగపు సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం ఆదర్శ పాఠశాలలో బ్యూటీ అండ్ వెల్నెస్ వృత్తి కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులకు పది రోజుల పాటు ప్రత్యేక జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఒకేషనల్ టీచర్ సిహెచ్ సంతోషి, కళాశాల ప్రిన్సిపాల్ టి.వి శైలజ ఆధ్వర్యంలో మియాపూర్‌లోని గ్రీన్ ట్రెండ్స్ పార్లర్‌లో విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్నెస్ సంబంధించి బ్రైడల్ మేకప్, హెయిర్ స్టైల్ తదితర అంశాల పై విద్యార్థులకు శిక్షణ ఇవ్వను న్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తాన, ప్రతిభా రాణి, భవానీ,సనా అఫ్రాజ్, చాందినీ ఖాన్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సంగారెడ్డి

2

శనివారం | 21 అక్టోబర్ 2023 | www.navatelangana.com

జీఎంఆర్‌కు హ్యాట్రిక్‌ను అందిద్దాం



నవతెలంగాణ-జిన్నారం

ఎమ్మెల్యే జీఎంఆర్‌ను ముచ్చటగా మూడోసారి గెలిపిం చి హ్యాట్రిక్ అందిద్దామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహి పాల్ రెడ్డి తనయుడు గూడెం విక్రమ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన డీఆర్ఎస్ యువత సదస్సుకు సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ నేత జిన్నారం వెంకటేష్‌గౌడ్‌లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గంలోని అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందిస్తూ ప్రతినిత్యం ప్రజాసేవలో ఉంటున్న జీఎంఆర్‌ను గెలిపించుకుందాం అంటూ యువతకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ శ్రేయోదాయకమైన కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువత విభాగం అధ్యక్షులు ఆది రామకృష్ణ, పార్టీ మండలాధ్యక్షులు రాజేష్, సోషల్ మీడియా అధ్యక్షులు భీమ్రావు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు, టీడీపీ మండలాధ్యక్షుడు

నవతెలంగాణ-గుమ్మడిదల

బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షులు ఎంఎస్ఆర్ యువసేన వ్యవస్థాపకులు ఎం.నరేందర్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు చిన్నపాపిని రామా గౌడ్ ఆయా పార్టీలకు రాజీనామా చేసి.. పటాన్చెరువు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. గుమ్మడిదల మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో అనేక మంది కార్యకర్తలతో కలిసి హస్తం కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పటాన్చెరు మినీ ఇండియా అని పిలవబడుతున్న నియోజకవర్గం ఆస్తిని దోచుకుంటున్న ప్రస్తుత ఎమ్మెల్యేను గద్దె దింపాలంటే అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. వార్డు సభ్యులు ఆకుల ఆంజనేయులు, అతినారం రాము, తెలుగు యువత అధ్యక్షుడు పి శ్రవణ్ రెడ్డి, మేకల యాదగిరి, రవీందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మేకల మహేష్, కొత్త విభీషణ్, రాజిరెడ్డి, కుమార్, సుమన్ కుమార్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- పదేండ్లలో పటాన్‌చెరు పట్టణ రుపురేఖలు మార్చాం
- ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అమలు చేశాం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పదేండ్ల కాలంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేసి, నిండు మనసుతో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. పటాన్‌చెరు పట్టణంలోని కాలనీలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం సతీ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికి తిరుగుతూ పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరు పట్టణం గత ప్రభుత్వాల హయంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై మౌలిక వసతుల కల్పనలో వెనుకబడి ఉండేదన్నారు. పదేండ్ల కాలంలో పటాన్‌చెరు పట్టణ రూపురేఖలు మార్చడంతో పాటు అభివృద్ధిలో ప్రతీకగా నిలిపామన్నారు. ప్రతీ గల్లీలో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని వర్గాలకు ఫంక్షన్ హాళ్లు, పార్కులు, కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ ఉచిత విద్య, మహనీయుల విగ్రహాలు, ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించడంతోపాటు అర్హులైన ప్రతీ ఒక్కరికి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. దీంతో పాటు అర్హులైన వారందరికీ డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను అందిస్తున్నామన్నారు. కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమం మరింత ముందుకు వెళ్లాలంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, గూడెం కల్పనా మధుసూదన్ రెడ్డి, కంకర సీను, వెంకటేష్, గుండమల్ల రాజు, నవీన్ రెడ్డి, మంగలి వినోద్, మాధవి, కొండల్, ధనరాజ్ గౌడ్, శ్యామ్, అరుంధతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే..

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని భారత్ పెట్రోల్ పంప్ ఎదురుగా ఉన్న వ్యవసాయ అభివృద్ధి శాఖ ఎస్‌బీఐ బ్యాంకను శివాజీ చౌక్ వద్దకు మార్చారు. ఈ సందర్భంగా శివాజీ చౌక్ వద్ద శుక్రవారం జరిగిన ఎస్‌బీఐ బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ అభివృద్ధి శాఖ ఎస్బిఐ బ్యాంక్ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇక్కడ మార్చడం జరిగిందన్నారు. ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మెన్ పరశురాం, బీఆర్ఎస్ మనూర్ మండలాధ్యక్షులు విట్టల్ రావు పాటిల్, బొక్కస్గావ్ పీఏసీఎస్ చైర్మెన్ వెంకట్రాములు, మున్సిపల్ కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షేట్కార్,సర్పంచ్లు చెన్నసప్ప, జైపాల్ రెడ్డి, మున్సిపల్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు గౌస్ చిస్తీ,మున్సిపల్ పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, సీనియర్ నాయకులు వంశిధర్ రెడ్డి తదితరులున్నారు.



ముదిరాజ్ మహాసభ అందోల్ నియోజకవర్గ ఇన్చార్జిగా చిట్టిబాబు

నవతెలంగాణ-జోగిపేట

ముదిరాజ్ మహాసభ అందోల్ నియోజకవర్గం ఇన్చార్జిగా అందోల్-జోగిపేట మున్సిపల్ 17వ వార్డ్ కౌన్సిలర్, జిల్లా యువత నాయకులు ఆకుల చిట్టిబాబును నియమిస్తూ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు టప్ప కుమార్ ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేశారు. శుక్రవారం పటాన్చెరు ముదిరాజు భవన్లో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా మహిళా అధ్యక్షురాలుగా జోగిపేట పట్టణానికి చెందిన అయ్యప్ప నిర్మలను నియమించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ.. అందోల్ నియోజకవర్గం లో ముదిరాజ్ కులస్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, కులస్తుల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వాలు కూడా ముదిరాజ్ కులస్తుల హక్కులను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజులు రాజ్యాధికారం దిశగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు సపాన్ దేవ్, రాష్ట్ర పోలీట్ బ్యూరో సభ్యులు బి. నారాయణ తదితరులు పాల్గొన్నారు.



అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-పుల్కల్

చౌటకూర్ మండలంలోని వెండికోల్ గ్రామంలో శుక్రవారం బతుకమ్మ పండుగ సంబురాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకలకు ఎలాంటి ఆటంకులు తలెత్తకుండా సర్పంచ్ పల్లవి జయరాం రెడ్డి రెండ్రోజుల క్రితం నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలు తీరొక్క పువ్వులతో అందంగా ముస్తాబు చేసిన బతుకమ్మలను అందరూ ఒక దగ్గర పేర్చి సంతోషంగా బతుకమ్మ ఆడారు. సర్పంచ్ పల్లవి జయరాం రెడ్డి కూడా వారితో కలిసి బతుకమ్మ పాటలు ఆటలు ఆడారు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్న చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

గీతంలో ఘనంగా ప్రపంచ కూచిపూడి దినోత్సవ వేడుకలు

- సంప్రదాయ శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించిన 23 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు

నవతెలంగాణ-పటాన్‌చెరు





గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్‌లోని లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో 'ప్రపంచ కూచిపూడి దినోత్స వాన్ని' శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మనదేశంలోని ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డున ఉద్భవించిన భారతీయ శాస్త్రీయ కళ అయిన కూచిపూడి నృత్య రూపానికి విద్యార్థులు నీరాజ నాలర్పించారు. 2020లో ప్రారంభించిన ప్రపంచ కూచిపూడి దినోత్సవాన్ని ప్రతియేటా అక్టోబర్ 15న కూచిపూడి గురువు పద్మభూషణ్ డాక్టర్ వెంపటిచిన సత్యం జయంతి సందర్భంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం నిర్వహి ంచిన ఈ వేడుకలలో 23 మంది ప్రతిభావంతులైన విద్యా ర్థులు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం బ్రహ్మాంజలి, జతిస్వరం సహా విశేషమైన ప్రదర్శనల మేళ వింపుతో సాగింది. కూచిపూడి చరిత్ర, సారాంశం, ప్రాముఖ్య తను పరిశోధించే పది నిమిషాల చలనచిత్రాన్ని ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఈ శాస్త్రీయ కళ ఆనందం తాండవాన్ని ఈ సంక్షిప్త చిత్రం విపులీ కరించింది. వెంపటి పెద సత్యం ఒక తెలుగు చలనచిత్రం కోసం మొదట కొరియోగ్రఫీ చేసిన 'ఏరువాక సాగారో' అనే జానపద సంగీత ప్రద ర్శన ఈ వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచింది. ఈ ప్రదర్శన కూచిపూడి గురువులు తెలుగు సినిమా పరిశ్రమకు అందించిన నిస్వార్థ సేవకు నివాళి. ఈ ప్రదర్శనలో పాల్గొన్న విద్యా ర్థులంతా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వె.లలిత సింద హరి ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ డైరెక్టర్ డాక్టర్ సన్నీ జోస్, ఆంగ్ల విభాగా ధిపతి డాక్టర్ డీఆర్పీ చంద్రశేఖర్, ఫైన్ ఆర్ట్స్ విభాగం సమ న్వయ కర్త డాక్టర్ మైథిలి అనూప్ సహా పలువురు విశిష్ట వ్యక్తుల సమక్షంలో ఈ వేడుకలు జరిగాయి. ప్రపంచ కూచి పూడి దినోత్సవాన్ని పురస్కరించుకుని, గీతం హైదరాబాద్ శాస్త్రీయ నృత్యం యొక్క గొప్ప సంప్రదాయాన్ని ప్రదర్శి ంచడం చాలా ఆనందంగా ఉందని డా.సన్నీజోస్ అభిప్రాయపడ్డారు. ఇటువంటి కళారూపాన్ని పరిరక్షించడం, ప్రచారం చేయడంలో తాము పాలుపంచుకుంటున్నందుకు గర్విస్తున్నామన్నారు. నందిని, విదుషి, సుప్రీత, ఇందీవర, మధు మిత, ఆన్ మరియా, శృతి, స్పందన, యామిని, అదితి, మా న్విత, భావన, తేజస్వి, తేజశ్రీ, ప్రణవ, పవిత్ర, పూజిత, మనో జ్ఞ, కవిష, భవ్య, హర్షిత, సుకృతి తదితరులు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు.



వైభవంగా దుర్గామాత దేవికి పూజలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

విజయదశమి పండుగను పురస్కరించుకుని దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రేజింతల్ గ్రామంలో దుర్గామాతకు ఐదోరోజైన శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అన్నపూర్ణ దేవి, మహాలక్ష్మి రూపంలో దేవి దర్శనమిచ్చింది. మహా మంగళారతులు సమర్పిస్తూ పూజారి సిద్దు స్వామి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలంగాణ ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం



నవతెలంగాణ-ఝరాసంగం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమకారులకు కేసీఆర్ ప్రభుత్వహయాంలో తీరని అన్యాయం జరిగిందని జహీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఏ.చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చేందుకు ప్రజలు నిర్ణయించుకున్నారని ధీమా వ్యక్తం చేశారు. 'వస్తున్న.. మీ కోసం' కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోనీ పొట్టిపల్లి, ఎల్గోయి, చిలపల్లితండా, బర్దిపూర్, కుప్పనగర్, మాచ్నూర్, కిష్టాపూర్, బిడకన్న గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వచిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని, భారత్ జోడో యాత్ర చేపట్టి దేశానికే మార్గదర్శకుడయ్యాడని ఆయనను విమర్శించే స్థాయి వాళ్లది కాదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే పేదవర్గాలకు సంక్షేమఫలాలు అందుతాయన్నారు. కేసీఆర్ చెప్పే మాయ మాటలు నమ్మి మరోసారి బీఆర్ఎస్ అధికారమిస్తే రాష్ట్రం మరో బీహార్‌లాగా మారుతుందన్నారు. ఈ సారి ఎలాగైనా గెలవాలని అన్ని రకాలుగా ప్రయత్నిస్తాడని, కానీ ప్రజలు వారి ఓట్లు చీలిపోకుండా కాంగ్రెస్ కే ఓటు వేసి కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఎల్గోయిలో యువకులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామంలో నిర్వహించిన ప్రచార సభకు జనం భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్య క్షులు హనుమంత్ రావు పాటిల్, ఎంపీపీ కే దేవదాస్, నాయకులు ఉదయ్ శంకర్ పాటిల్, ఉజ్వల్ రెడ్డి, ముల్తాని, శంకర్ పాటిల్, దానిగి నాగేష్ పాటిల్, దండు గుండప్ప, ఎండి అంజద్, డి.విఠ్ఠల్రెడ్డి, రమేశ్ పాటిల్, సాబేర్, రాజా రత్నం, మాటూరి రాజు, అన్సార్,ప్రకాష్, ఎ లక్ష్మణ్, బసంతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ ఆత్మీయ సమ్మేళనంలో చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ డాక్టర్లల ఆత్మీయ సమ్మేళనంలో సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్, ఎంఎస్ఐడీసీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల సంపూర్ణ మద్దతు చింతా ప్రభాకర్‌కే ఉంటుందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. చింతా ప్రభాకర్ చేసిన సేవలకు తమ ఓటు ద్వారా రుణం తీర్చుకుంటామ న్నారు.కమిటీ హాల్ మంజూరు చేయాలని చింతా ప్రభాకర్ దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి, తనకు ఆరోగ్యం కొంత బాగాలేకున్నా.. సీఎం కేసీఆర్ మరోసారి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏకగ్రీవంగా తీర్మానం చేసి మద్దతు ఇస్తామని చెప్పిన అసోషియేషన్ సభ్యులకు ధన్యవదాలు తెలిపారు. ఎర్రోళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి హరీశ్‌రావుతో మాట్లాడి కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మనోహర్ గౌడ్, పార్టీ మండలాధ్యక్షులు చక్రపాణి, డా. శ్రీహరి, సీడీసీ మాజీ చైర్మెన్ విజేందర్ రెడ్డి, గాఫర్ ఆర్ ఎం పీ,పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ డాక్టర్లు పాల్గొన్నారు.



నల్తూరులో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని నల్తూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ పథకాలను వివరిస్తూ గడపగడపకు ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్, జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.5.50 లక్షలు పట్టివేత

నవతెలంగాణ-న్యాల్‌కల్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన వాహన తనిఖీల్లో హద్నూర్ పోలీసులు రూ.5.50లక్షలను పట్టుకుని సీజ్ చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మండల ంలోని హుసెల్లీ కర్నాటక సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద హద్నూర్ ఎస్సై రామా నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం వాహన తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఎలాంటి ఆధారాలు లేని రూ.5.50లక్షలు పట్టుబడ్డాయి. ఆ నగదును సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

నేడు జిన్నారంలో అన్నదానం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఏడుపాయల వనదుర్గ దేవాలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే విజయంతం చేయాలని వారు కోరారు.

తెలంగాణలో కేసీఆర్ పోవడం.. బీజేపీ రావడం ఖాయం

నవతెలంగాణ-జోగిపేట



ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కేసీఆర్ పోవడం.. బీజేపీ రావడం ఖాయమని కర్ణాటక బీజేపీ ఔరద్ ఎమ్మెల్యే, జిల్లా పరిశీలకులు ప్రభు చౌహన్ అన్నారు. జోగిపేటలోని వాసవి కళ్యాణ మండపంలో ఆందోల్ నియోజకవర్గం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరైన మాట్లాడారు. ప్రజలను మోసం చేస్తూ కేసీఆర్ పదేండ్ల పాటు అధికార దుర్వినియోగం చేశారన్నారు. నరేంద్ర మోడీ దేశ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని ప్రజలు విశ్వసిస్తున్నారని, తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమ గీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దళిత బంధు, బీసీ బందు పథకాలలో ఎంతమందికి ఇచ్చారు ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. దేశంలో నెంబర్ 1 కాంగ్రెస్, నెంబర్ 2 బీఆర్ఎస్ పార్టీలు మోసపూరిత పార్టీలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా అర్హులకు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడటంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఎవరిని వదిలిపట్టే పరిస్థితి లేదన్నారు. అభ్యర్థుల ఎంపిక హై కమాండ్ చూసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పి.బాబు మోహన్, జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, జిల్లా ఇన్చార్జి రంగారెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాస్, జగన్నాథం, సువన్,చంద్రశేఖర్, శివశంకర్, పండరి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫోటోగ్రాఫర్ ఎన్నికలు

- విజయం సాధించిన అనిల్ ప్యానల్
- నీలం మధును మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అసోసియేషన్
- అభినందించిన నీలం మధు ముదిరాజ్

నవతెలంగాణ-పటాన్‌చెరు



రుద్రారం నుంచి చందానగర్ వరకు గల ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. రెండు వర్గాల మధ్య హెరారా హెూరీగా జరిగిన ఈ ఎన్నికల్లో అనిల్ కుమార్ రెండు ఓట్ల తేడాతో కృష్ణ యాదవ్‌పై విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన అనిల్ ప్యానల్ చిట్కుల్‌లో నీలం మధు ముదిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, జనరల్ సెక్రెటరీ లక్ష్మారెడ్డితో పాటు కమిటీ సభ్యులందరికీ నీలం మధు ముదిరాజ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రాఫర్ యూనియన్ ఎన్నికల్లో కూడా కొందరు రాజకీయాలు చేసిన సమర్థవంతంగా ఎదుర్కొని తిప్పి కొట్టినందుకు ప్రత్యేకంగా అనిల్ ప్యానల్‌ని అభినందించారు. అయితే యూనియన్‌లలో వర్గాలు ఉండకూడదని ఎన్నికల్లో పోటీచేసిన రెండు వర్గాలు సోదర భావంతో కలిసి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి ముందుకు సాగితేనే యూనియన్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చన్నారు. తాను ముందు నుంచి అందరి ఫోటోగ్రాఫర్ల అభ్యున్నతి కోసం వారికి అండగా ఉంటూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు. గతంలో పటాన్ చెరు నియోజకవర్గంలో ఫోటో వీడియో గ్రాఫర్ల సోదరులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్‌లు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఫోటోగ్రాఫర్ల కుటుంబ సభ్యులు మద్దతు తెలపాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించిన వెంటనే ఫోటోగ్రాఫర్ అసోసియేష న్లోని అందరికీ వంద గజాల చొప్పున ఇంటి స్థలాలను ఇస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన యూనియన్‌కి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, ఎన్నికైన ప్యానల్ ఫోటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుని పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, వీరేశం, నరసింహ, తన్మయి, రజినీకాంత్, జగన్, రాజేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి విశేష స్పందన



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో గత 90 రోజుల నుంచి చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని మాజీమంత్రి జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఆయన గృహంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గత తొమ్మిదేండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో రకాల ఇబ్బందులకు గురయ్యారన్నారు. అధికార పార్టీ నాయకులు తమ పార్టీకి చెందిన కార్యకర్తలకు, నాయకులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందనివ్వకుండా అన్ని విధాల వేధింపులకు గురి చేశారని ఇది మంచి పరిణామం కాదన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్ కోహిర్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల్లో ప్రజలు ఇప్పటికే బ్రహ్మరథం పట్టారన్నారు. వారి ఆదరణ చూస్తుంటే.. తన గెలుపును ఎవరు కూడా ఆపలేరని స్పష్టం అవుతున్నదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శుక్లవర్ధన్‌రెడ్డి, హనుమంతరావు పాటిల్, భాస్కర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ అశోక్‌కు కాంగ్రెస్ ఆహ్వానం

నవతెలంగాణ-జిన్నారం



మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన గడ్డపోతారం మాజీ సర్పంచ్, బీఆరఎస్ నాయకులు మద్దూరు పటేల్ అశోక్‌ను ఎంపీపీ రవీందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణలతో కూడిన కాంగ్రెస్ శ్రేణుల బృందం శుక్రవారం కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించింది. ఈ మేరకు వారు ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ.. కాటా శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలకు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టేందుకు కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు చెప్పారు.

నవతెలంగాణ
మెదక్
3
శనివారం | 21 అక్టోబరు 2023 | www.navatelangana.com

చిట్కుల్‌లో మీసేవ కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-చిలిపిచేడ్

నూతనంగా ఏర్పాటైన చిలిపిచేడ్ మండలానికి రెండు మీ సేవ కేంద్రాలు మంజూరు కాగా చిట్కుల్ గ్రామానికి ఒకటి, చిలిపిచేడ్ మండల కేంద్రానికి మరొకటి మంజూరయ్యాయి. శుక్రవారం చిట్కుల్ గ్రామంలో శ్రీ ఆంజనేయ కమ్యూనికేషన్ మీసేవను వైస్ ఎంపీపీ గోవిందం విశ్వంభరా స్వామి, సర్పంచ్ గోపాల్ రెడ్డి , చిట్కుల్ ఎంపిటిసి సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో మీ సేవ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం మండలానికి 2 మీసేవ కేంద్రాలు రావడంతో మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఆంజనేయ కమ్యూనికేషన్ యజమాని ఆంజనేయులు, ఉపసర్పంచ్ సుధాకర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ సజావుగా నిర్వహించాలి



- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్

ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మెదక్ నియోజకవర్గంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను శుక్రవారం పరిశీలించారు. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి అనువుగా ఉన్న కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. ఈ తనిఖీలో ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, తహశీల్దార్ శ్రీనివాస్, డిఎస్పి ఫణిందర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక యాప్ ద్వారా వీవీ ప్యాట్ యంత్రాల కేటాయింపు

నవతెలంగాణ-మెదక్

ఎన్నికలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు మొదటి ర్యాండమైజేషన్ పూర్తి అయిన పిదప స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సయ్యద్ ఇష్రత్, గౌస్ కురేషి, అంజనేయులు, నర్సింహులు, బస్వరాజు, అఫ్జల్‌లతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 4,34,900 మంది ఓటర్లున్నారని, 579 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు 25 శాతం, వీవీ ప్యాట్‌లు 40 శాతం అదనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి ర్యాండమైజేషన్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఆటోమాటిక్‌గా నియోజకవర్గం, పోలింగ్ బూత్ వారీగా ఏఏ యంత్రాలు కేటాయించాలో జనరేట్ చేసిన జాబితాను అందజేస్తూ శనివారం ఉదయం 9 గంటలకు ఏవిఎం గోదాములకు రావాలని కోరారు. అక్కడ నియోజకవర్గం వారీగా జనరేట్ చేసిన జాబితా ప్రకారం కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను ఆయా నియాజకవర్గాలకు గట్టి భద్రత మధ్య తరలించి ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామన్నారు. రెండవ దఫాలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ జరుగుతుందన్నారు. మూడవ ర్యాండమైజేషన్‌లో కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేస్తామన్నారు. పోలింగ్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఏజెంట్లు ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ సమయంలో ఏమి చేయాలో తగు శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు.



ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు, వాహనాలు, సభలు, సమావేశాల ఏర్పాటు, డబ్బు పంపిణీ, తాయిలాలు ఇవ్వడం వంటివి దృష్టికి వస్తే వెంటనే తెలపాలన్నారు. లేకుంటే అభ్యర్థి ఖర్చు క్రిందకు వెళుతుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన అసత్య వార్తల పట్ల అప్రమత్తం ఉండాలని, అభ్యంతరకర పోస్టులు ఉండరాదని హితవు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా ఫుట్ బాల్ ప్రీమియర్ లీగ్

- పోటీలను ప్రారంభించిన పునీత్ రెడ్డి
- నేడు ఫైనల్ పోటీ



నవతెలంగాణ-మెదక్

ఫుట్ బాల్ ప్రీమియర్ లీగ్ 2 పోటీలు మెదక్ వెస్లీ మైదానంలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మెదక్ ఫుట్ బాల్ క్లబ్ అధ్వర్యంలో రెండవ విడత ఫుట్ బాల్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను పునీత్ రెడ్డి ప్రారంభించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని నాలుగు టీమ్‌లు ఈ పోటీలో పాల్గొనగా మొదటి పోటీని పునీత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ అంటేనే ఫుట్‌బాల్‌కు పెట్టింది పేరని, ఇక్కడ ఎంతో మంది ఫుట్‌బాల్ క్రీడాకారులను అందించిందని గుర్తు చేశారు. ఫుట్‌బాల్ అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. క్రీడాకారులు మంచి నైపుణ్యంతో ఆడుతున్నారన్నారు. జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేయాలని కోరారు. ఫుట్ బాల్ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జయరాజ్, ఫుట్ బాల్ క్రీడాకారులు గోపాల్ గౌడ్, రాంచందర్, బాలకృష్ణ, భాణి, రాజ్ గోపాల్, రూపెందర్, శ్రీనివాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిజాంపేట

వరి చేనులు కోతకొచ్చినందున వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిజాంపేట మండల రైతులు వేడుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి సెంటర్లను కూడా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించినట్లయితే రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదని, ఆలస్యం చేసినట్లయితే అకాల వర్షాలతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిజాంపేట మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు వేడుకుంటున్నారు. గన్ని బ్యాగులను ప్రభుత్వం వెంటనే



రైతులకు అందుబాటులో ఉండే విధంగా సరఫరా చేయాలన్నారు.

సద్దుల బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ - చిన్నకోడూరు

ప్రకృతి ఒడిలో ఉదయించే పూలను అలంకరించి వాటిని భక్తి శ్రద్దలతో పూజించి జరుపుకునే పండుగ బతుకమ్మ అని ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, సర్పంచుల ఫోరం చిన్న కోడూరు మండల అధ్యక్షుడు కాముని ఉమేష్ చంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నకోడూరు మండలంలోని కొన్ని గ్రామాల్లో 7 రోజులలో సద్దుల బతుకమ్మ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అనీ, దీంతో ఉదయమే మహిళలు, చిన్నారులు పువ్వులను తీసుకొచ్చి భక్తిశ్రద్దలతో బతుకమ్మను పేర్చి అందరూ ఒకచోట చేరి బతుకమ్మ పాటలతో, సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైనా బతుకమ్మను ఆటపాటలతో సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా జరుపుకుంటారని అన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకైన బతుకమ్మ పండుగను భక్తి శ్రద్దలతో జరుపుకుంటున్న మండల ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలతో పాటు ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దసరా పండుగ అందరి జీవితాల్లో ఆనందాలు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

తహసీల్దార్ సమక్షంలో కాంగ్రెస్ నాయకుల బైండోవర్



నవతెలంగాణ-నార్సింగి

సార్వత్రిక ఎన్నికలను సజావుగా జరపడానికి జాతీయ ఎన్నికల కమిషన్ అనేక చర్యలను చేపడు తుంది. మండల తహశీ ల్దార్ షేక్ కరీం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను నార్సింగి పోలీసులు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కరీం మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడానికి, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా ఇదివరకే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను బైండోవర్ చేయడం జరిగిందని, ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులను బైండోవర్ చేస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరపడానికి అన్ని చర్యలు చేపడుతు న్నామన్నారు. ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడితే, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నార్సింగి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కేశవులు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి బాచి, ఫిషర్మేన్ బోర్డు చైర్మన్ సుధాకర్, జప్తీ శివనూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు చాంద్ పాషా, ఎస్సీ సెల్ శంకర్ నాయకులను బైండోవర్ చేశారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- బీఆర్ఎస్ జిల్లా నాయకులు రవితేజ రెడ్డి

నవతెలంగాణ-కొల్చారం

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమితో ఎవరు కుంగిపోకుండా విజయం కోసం అహర్నిశలు కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు యాబన్నగారి రవితేజ రెడ్డి అన్నారు. శుక్రవారం కొల్చారం మండలం పైతరలో గత మూడు రోజులుగా జరుగుతున్న యాబన్నగారి ఆగం రెడ్డి, చంద్రమ్మల జ్ఞాపకార్థం కబడ్డీ పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. అంతరించిపోతున్న గ్రామీణ కబడ్డీ క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కబడ్డీ పోటీలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన పైతర సెవెన్ టైగర్స్ జట్టుకు రూ.10వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. అలాగే రన్నర్‌గా నిలిచిన డైనమిక్ టైగర్స్ జట్టుకు రూ.5వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ



సభ్యులు ఆరట్ల ఎల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్

- చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు
- రామక్కపేట గ్రామస్తులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానం

నవతెలంగాణ దుబ్బాక రూరల్

దుబ్బాక లో బీజేపీ, బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. దుబ్బాక మండలం రామక్క పేట గ్రామానికి చెందిన సుమారుగా 50 మంది మహిళలు, గ్రామస్తులు బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకి రాజీనామా చేశారు. శుక్రవారం రామక్క పేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలకిషన్ ఆధ్వర్యంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి చెఱకు శ్రీనివాస్ రెడ్డి సాధారంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. యావత్ ప్రజలు రాష్ట్రంలోనూ , దేశంలోనూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని వారు అన్నారు. దుబ్బాక గడ్డపై తిరిగి కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దుబ్బాక అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని నమ్మి నేడు పార్టీలో రామక్క పేట గ్రామస్తులు చేరారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, దుబ్బాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంగరి రవి, ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, దుబ్బాక మున్సిపాల్ జనరల్ సెక్రెటరీ మంద శ్రీనివాస్, దుబ్బాక నియోజకవర్గం అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ఆకుల భరత్,దుబ్బాక మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లక్ష్మి ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-మెదక్



కాంగ్రెస్, బీజేపీల నుంచి సుమారు 200 మంది కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హవేళిఘనపూర్ మండలంలోని సర్దన గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సంతోష్ కుమార్, బీజేపీ గ్రామ బూత్ అధ్యక్షుడు పట్నం భువనేశ్వర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రామచంద్ర గౌడ్, గంగారం, సహా పలువురు కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ తిరుపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మెదక్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, ఎంపీపీ నారాయణ రెడ్డి, నాయకులు మాణిక్యరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔరంగాబాద్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు దేవాలాల్, బీజేపీ నాయకులు జయరాం, తాండవాసులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే మెదక్ మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన యువత గ్రామ సర్పంచ్ పద్మావెంకట్, ఎంపీటీసీ యాదగౌడ్ ఆధ్వర్యంలో యువత పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు దేవేందర్ రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి తనయుడు, యువ నాయకుడు పునీత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజయ్య, యూత్ నాయకులు బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ రాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు కావేరి సిద్ధిరాములు, బండి భూషణం, బోయిని చిత్తారి, వార్డు మెంబర్ కావేరి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో శ్రీ దుర్గా మాత ఉత్సవ కమిటీ 19వ వార్షికోత్సవంలో భాగంగా దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమార్చనతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురోహితులు వేలేటి లక్ష్మణ శాస్త్రి మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సరస్వతి దేవి అవతారంలో అమ్మవారు కొలువదీరారని అన్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వమించిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరు కావడం శుభసూచికమన్నారు. అమ్మవారి కృపా కటాక్షాలు గ్రామ ప్రజలకు ఉండాలని పంటలు సుభిక్షంగా పండాలని అమ్మ వారిని కోరుకున్నారు. అనంతరం జిట్టి రమేష్ వసంత, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు చంద్రకాంత్, బట్టు మహేష్, శ్రీకాంత్, చీకోటి వెంకటేశం, కృష్ణమూర్తి, లక్ష్మణ్, శివకుమార్, జీపి స్వామి, బోగి, ప్రశాంత్, తిరుపతి, రాజేశ్వర్ గౌడ్, మహిళలు అర్చన, శోభా, వినోద, భవాని, సౌజన్య, మానస, కళావతి, స్వప్న, సంధ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను తుంగలోకి తొక్కుతున్న బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవ తెలంగాణ - సిద్దిపేట

ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీ ప్రజా ప్రతినిధులు ఇంకా కొనసాగిస్తున్నారని, దీనిపై ఎన్నికల అధికారులు స్పందించి సంబంధిత కౌన్సిలర్‌పై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ను తుంగలోకి తొక్కేలా బి ఆర్ ఎస్ పార్టీ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలోని 20 వార్డు కౌన్సిలర్ రియాజ్ పారిశుద్ధ కార్మికులకు బతుకమ్మ చీరలను అందించడంతోపాటు, రూ 500 నగదును కూడా అందజేశారని అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న అవేమీ పట్టనట్టుగా వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ , ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీవో లు వెంటనే స్పందించి కౌన్సిలర్ రియాజ్ పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మజహర్ మాలిక్, గాయసిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గాభవానీ మాత సన్నిధిలో బోనాలు

- శరన్నవరాత్రిఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పాపన్నపేట

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఏడుపాయల వన దుర్గ భవాని మాత సన్నిధిలో బోనాలు తీసే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోకుల్‌షెడ్‌లో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో 100 పైచీలుకు బోనాలు తీసే కార్యక్రమం బ్రహ్మాండంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆటపాటలతో నృత్యాలు చేస్తూ, కోలాటం ఆడుతూ శివసత్తుల నృత్యాల మధ్య ఎంతో వైభవోపేతంగా బోనాలు తీసే కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఒక జోగిని బోనంతో నృత్యం చేయడం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏడుపాయల చైర్మెన్ బాలాగౌడ్ బోనమెత్తి ముందు నడవగా ఆయనను మిగతా వారు బోనమెత్తుకొని అనుసరించాయి, శరన్నవరాత్రి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి ఏడుపాయలకు హాజరైన భక్తులు బోనాల కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

వనదుర్గను దర్శించుకున్న ఎమ్మెల్యే

ఏడుపాయల వన దుర్గాభవానీ మాతను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, వేద పండితులు ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి ఆలయ మర్యాదల ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, ఆలయ చైర్మన్ బాలాగౌడ్ తదితరులున్నారు



కాత్యాయని రూపంలో దుర్గామాత

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు అయిన శుక్రవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారిని కాత్యాయని (సరస్వతీ)రూపంలో తెలుపు రంగులో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్ దుర్గామాతతో పాటు గోకుల్ షెడ్లో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాన్ని సైతం సరస్వతీ మాత రూపంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మెన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి వెల్లడించారు.

సిద్దిపేటలో ఎన్నికల కోలాహలం

- మా పార్టీ అభ్యర్థులు ఎవరు ఆలోచనలో కార్యకర్తలు
- ప్రతిపక్షం ప్రచారం చేస్తుంది... మేము ఏం చేయాలి అంటున్న కాంగ్రెస్, బీజేపీ అభిమానులు

నవ తెలంగాణ - సిద్దిపేట

రాష్ట్ర అసెంబ్లీ నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి సిద్దిపేట జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. మొన్నటిదాకా కాంగ్రెస్, బిజెపి పార్టీల అధిష్టానం టికెట్ ఆశిస్తున్న ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించినన్ని రోజులు జిల్లాలోని నియోజకవర్గాల్లో పార్టీ ఆశిస్తున్న వారితో కొంత సందడి కనిపించింది. బీఆర్ఎస్ పార్టీ మాత్రం జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడంతో అక్కడ ఆ పార్టీ శ్రేణులు తమ అభ్యర్థిని గెలిపించాలంటూ ఇంటింటా వాడవాడలా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గంకు తూముకుంట నర్సారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది, ఇతర నియోజకవర్గాలకు ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. అదేవిధంగా బిజెపి ఇంకా అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఆ పార్టీలకు చెందిన కార్యకర్తలు అభిమానులు తాము ఎవరి తరఫున ప్రచారం చేయాలో అనే పాలు పోకుండా... మా పార్టీ అభ్యర్థులు ఎవరు అని ఆలోచనలో పడ్డారు. అధిష్టానం తొందరగా అభ్యర్థులను ప్రకటించాలని కోరుతున్నారు.

అభ్యర్థులే కీలకం..

జిల్లాలో గతంలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ లో బిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందగా, దుబ్బాక లో మాత్రం బిజెపి అభ్యర్థి గెలుపొందారు. కాగా సిద్దిపేటలో హరీశ్ రావు పై పోటీ చేసిన వారిలో ప్రత్యార్థులకు డిపాజిట్లు కూడా దక్కలేదు. ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ప్రకటించే అభ్యర్థులే కీలకం కానున్నారు. టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించుకొని, సీఎం కేసీఆర్ హుస్నాబాద్, సిద్దిపేటలో ప్రజా ఆశీర్వాద సభల పేరిట ప్రచారాన్ని నిర్వహించారని, కానీ తమ పార్టీలకు అభ్యర్థులే ప్రకటన కాలేదని, తాము ఎవరి పేరుతో ప్రచారం చేయాలని బిజెపి, కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు ఆందోళన చెందుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఆందోళనలో టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు

బిజెపి, కాంగ్రెస్ పార్టీల నుండి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు తమ పేర్లు ఇంకా ఖరారు కాకపోవడంతో ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తుంది. టికెట్ ఆశిస్తున్న వారు ఇంకా ఎన్ని రోజులు కార్యకర్తల, నాయకుల వెంబడే తిరగాలనా... ప్రజలలోకి ఎప్పుడు పోవాలి అనే నిరాశలో ఉన్నట్లు సమాచారం. ధైర్యం చేసి ప్రజలలోకి వెళ్లి, కొంత ఖర్చు పెట్టుకుని ప్రచారాన్ని చేసినా ...తీరా చివరికి టికెట్ రాకపోతే ఇటు పరువు పోతుందని, ఆటు ధనం వృధా అవుతుందనే ఆలోచనతో టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు పాలు పోనీ స్థితిలో ఉన్నట్లు సమాచారం. బిఆర్ఎస్ పార్టీకి పోటీని ఇవ్వాలంటే.... వెంటనే తమ పార్టీలకు చెందిన అభ్యర్థులను ప్రకటించాలని బిజెపి, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు, నాయకులు అధిష్టానాన్ని కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై సమీక్ష

నవతెలంగాణ-నిజాంపేట 3

ఎన్నికల నేపథ్యంలో మౌలిక వసతులపై శుక్రవారం ఎంపీపీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో జగదీశ్వర్, తహసీల్దార్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్స్, రేషన్ డీలర్, బిఎల్ ఓ, ఆశా వర్కర్‌లతో సమీక్ష సమావేశం ఏరాఀఉపటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, తహసీల్దార్‌లు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాలలో పోలింగ్ బూతులలో మౌలిక వసతులు ఎలక్ట్రిసిటీ, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, వసతులు కల్పించేలా చూడాలన్నారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజేందర్,



ఆర్ఐ గంగాధర్ గౌడ్, ఆయా గ్రామాల కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్స్, రేషన్ డీలర్లు, ఆశా వర్కర్లు, కరోబార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
శనివారం | 21 అక్టోబరు 2023 | www.navatelangana.com

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



నవతెలంగాణ-దౌల్తాబాద్
అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని హైమద్ నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... నిజామాబాద్ జిల్లా మోస్రా మండల పరిధిలోని గోవూర్ గ్రామానికి చెందిన పోసంగారి భాస్కర్ రెడ్డి(45) భార్య లక్ష్మీ పిల్లలతో కలిసి మేడ్చల్ పట్టణంలో ఎలక్ట్రిక్ న్ పనులు చేస్తూ జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. గురువారం ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోయాడు. అనుమానాస్పదంగా మృతి చెందాడు. శుక్రవారం ఉదయాన తిరుమలాపూర్ మాజీ సర్పంచి యాదవ రెడ్డి మృతుడి భార్య లక్ష్మి కి చరవాణి ద్వారా సమాచారాన్ని అందించారు. లక్ష్మి తన సోదరులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని భాస్కర్ రెడ్డిగా గుర్తించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన చింతలపల్లి జనార్దన్ రెడ్డి



నవతెలంగాణ-బెజ్జంకి : మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామానికి చెందిన ఆప్ పార్టీ జిల్లా ఇంచార్జీ చింతలపల్లి జనార్ధన్ రెడ్డి శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జీ కవ్వంపల్లి సత్యనారాయణ తన కార్యాలయంలో జనార్ధన్ రెడ్డికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు ఒగ్గు దామోదర్,రత్నాకర్ రెడ్డి, పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,శానగొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో ఆనందం



నవతెలంగాణ-వర్గల్
మండలంలోని నవోదయ విద్యాలయంలో శుక్రవారం 'బ్యాగ్ లెస్ డే' ఐదో రోజుకు చేరుకున్నది. బ్యాగ్ లెస్ డే లో భాగంగా విద్యార్థులు గోడలపై ప్రముఖుల చిత్రాలను చిత్రించారు. శిల్పాలకు రంగులు వేశారు. పాఠశాల ఆవరణలో వాల్ రైటింగ్ చేశారు. అలాగే సంగీత వాయిద్యాలు వాయిస్తూ పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరప్రసాద్‌గౌడ్‌కు జాతీయ అవార్డు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్
న్యూ ఢిల్లీలో ఆంధ్ర అసోసియేషన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గీతా కార్మికుల అభివృద్ధికి నిరంతరం కృషిచేసిన హుస్నాబాద్ పట్టణ యువకుడు, గీత పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు పూదరి వరప్రసాద్ గౌడ్ బహుజన సాహిత్య అకాడమీ (బిఎస్ఎ)జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, సొసైటీ ప్రధాన కార్యదర్శి సుబ్రమనియన్ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్నారు. దేశంలోని 27 రాష్ట్రాల నుండి సుమారుగా 1000 మంది డెలికేట్స్ ఈ కాన్ఫరెన్స్ కు హాజరైనట్లు వెల్లడించారు. కాగా తన సేవను గుర్తించి జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక చేసిన రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

కొండపాకలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-కొండపాక
మండల కేంద్రమైన కొండపాక దమ్మక్కపల్లి గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబరాలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ సాధారణంగా తొమ్మిది రోజులు జరుగుతుండగా ఈ రెండు గ్రామాల్లో మాత్రం ఏడు రోజుల్లో మాత్రమే నిర్వహిస్తారు. పూర్వకాలం నుంచి ఏడు అనే సంఖ్య ఈ గ్రామాలకు కలిసి రావడంతో అప్పటినుంచి ఏడో రోజున సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహిస్తున్నారు. రంగురంగుల తీరొక్క పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి గ్రామంలోని పలు కూడళ్ళ వద్ద పెట్టి మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు. అనంతరం బతుకమ్మ లను ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేశారు. గ్రామ సర్పంచ్ చిట్టి మాధురి ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

బీఆర్ఎస్ సమావేశానికి బయలుదేరిన కార్యకర్తలు



నవతెలంగాణ-జగదేవపూర్
జగదేవపూర్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పనిగట్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కేసీఆర్‌తో ముఖ్య కార్యకర్తల శుక్రవారం సమావేశానికి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే మళ్లీ గెలిపిస్తాయన్నారు పుట్టిన పసిబిడ్డ నుంచి వృద్ధులు దాక ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలలో ప్రతి ఇంటికి ఏదో ఒక రకమైన సంక్షేమ పథకం అందిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో గత 70 సంవత్సరాలుగా జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం సాధించిందన్నారు. గజ్వేల్ నియోజకవర్గం ప్రజలు కేసిఆర్ కు ఎప్పుడు రుణపడి ఉంటారన్నారు. సమావేశానికి బయలు దేరిన వారిలో మండల నాయకులు వివిధ గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

బీహార్ రాష్ట్రానికి చెందిన పంచాయితీరాజ్ ఆడిటర్స్ మిషన్ భగీరథ ప్రాజెక్ట్ సందర్శన



నవతెలంగాణ -గజ్వేల్
డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 7 రోజుల శిక్షణలో ఉన్న బీహార్ రాష్ట్రానికి చెందిన పంచాయతీరాజ్ విభాగంకు చెందిన ఆడిటర్స్ 156 మంది అధికారులు మిషన్ భగీరథ ప్రాజెక్ట్ ను సందర్శించారు. ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డా. శశాంక్ గోయల్ ఆదేశాలతో కోర్సు డైరెక్టర్ శ్రీమతి జయశ్రీ సూచనలతో కోర్సు కోఆర్డినేటర్ డా. శ్రీనివాస్ పెద్దబోయిన పర్యవేక్షణలో గజ్వేల్‌ని కొమటిబండ గ్రామంలోని మిషన్ భగీరథ ప్రాజెక్ట్ 540 నీటి శుద్ధికరణ కేంద్రం మంగోల్ ని సందర్శించి చాల సంతోషం వ్యక్తం చేసారు. అధికారులు తెలంగాణా ప్రభుత్వ పని తీరును తెలంగాణా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ఆడిటర్స్ కొనియాడారు. ఈ అధికారులందరికీ ప్రాజెక్ట్ డిప్యూటి ఇంజనీర్ నాగార్జున రావు ప్రాజెక్ట్ ప్రాముక్యత దాని పనితీరును వివరించారు , ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంజనీర్ లు వీణ శ్రీధర్ లు పాల్గొన్నారు.

గీత వృత్తిదారులకు రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీలివ్వాలి

- దాకొల్ల ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-దౌల్తాబాద్
గీత వృత్తిదారులకు వృత్తిరక్షణ, ఆధునీకరణ, నిధుల కేటాయింపుపై రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో స్పష్టమైన హామీ ఇవ్వాలని గౌడ సంఘం నాయకులు డాకోల్ల ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. చెట్టు పైనుంచి పడి మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ఇచ్చే ఎక్స్ గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని, వృత్తి పెన్షన్ గా నెలకు రూ.5000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వన పెంపకానికి ప్రతి సొసైటీకి పదెకరాల భూమిని కేటాయించాలని, ప్రతి గ్రామంలో కల్లుగీత సహకార సంఘానికి 1000 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. గీత వృత్తిదారుల కుటుంబాలకు విద్య, వైద్య పథకాలని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. గీత వృత్తిదారులకు గతంలో పేర్కొన్నట్లు టూవీలర్స్, వృత్తి పరికరాలు అందించాలని కోరారు. కల్లుగీత వృత్తిని అభివృద్ధి చేయుటకు గీత వృత్తిదారులకు శిక్షణ, ఉపాధి కేంద్రాలని తాటి ఈతవనాలున్న చోట నెలకొల్పాలన్నారు.

ఎన్నికల విధులపై అధికారులకు అవగాహన







నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్
కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫస్ట్ రౌండ్ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి జిల్లాలో గల 4 శాసనసభ నియోజకవర్గాలకు ఆయా నియోజకవర్గాల లో గల పోలింగ్ కేంద్రాలకు అదనంగా 25 శాతం బ్యాలెన్సింగ్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను మరియు 40 శాతం వివి ప్యాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తి పారదర్శకంగా కంప్యూటర్ ద్వారా ఆటోమేటిక్ పద్ధతిలో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ పూర్తి చేసి జిల్లాలో గల 4 శాసనసభ నియోజకవర్గాలకు పోలింగ్ కేంద్రాల కంటే 25 శాతం అదనంగా ఎలక్షన్ బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లను మరియు 40% అదనంగా వివి ప్యాట్లను కేటాయించామని అన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారుల సమ క్షంలో ఎన్నికల పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందు కు రేపు కొండపాక మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్ లో గల ఈవిఎం మెషిన్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్కాన్‌చేసి ప్రతి నియోజకవర్గానికి 102 ఈవీఎంలను నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారు లకు అందజేసి పోలీస్ బందోబస్తు మధ్య నియోజకవర్గ కేంద్రాలకు పంపడం జరుగుతుందని తెలిపినారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మరియు జిల్లా డిప్యూటీ ఎలక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటిండెంట్ రామేశ్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు బిఆర్ఎస్ జి.మోహన్ లాల్, కాంగ్రెస్ ఎండి ఇమాముద్దీన్, బిజెపి భోగి శ్రీనివాస్, ఏఐఎంఐఎం ఎండి మునీర్, బీఎస్పీ ఎల్. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రామోజీ ఫిల్మ్ సిటీ సందర్శించిన ఎన్ సీ సీ క్యాండిడేట్స్





నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్
గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర సముదాయంలో దిగ్విజయంగా కొనసాగుతున్న యన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరంలో కాడేట్లకు రామోజీ ఫిల్మ్ సిటీని సందర్శించినట్లు క్యాంప్ కమాండ్ కల్నల్ సునీల్ అబ్రహం తెలిపారు. శుక్రవారం క్యాంపులో భాగంగా రామోజీ ఫిలిం సిటీ ని సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపు పర్యటన అధికారి లెఫ్టినెంట్ కల్నల్ పినాకి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ స్థానాలలో అత్యంత అద్భుతమైన పర్యటన రామోజీ ఫిల్మ్ సిటీ అన్నారు. మన యన్ సీసీ స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపు దేశం నలుమూలైన జమ్మూ కాశ్మీర్, లడక్, అండమాన్ నికోబార్, ఉత్తరాఖండ్, ఢిల్లీ లాంటి అనేక రాష్ట్రాల కాండెట్లని చాలా ఉత్సాహాన్నిచ్చినట్లు తెలిపారు. వాలీబాల్ ఫైనల్ విజేతలు తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ డైరెక్టరేట్ ఈ సందర్శనలో ఉన్నట్లు వారి పేర్కొన్నారు. అంతేకాకుండా ఉదయం గజ్వేల్ క్రీడా నిర్ణేతలు ప్రభు, భాను సమక్షంలో తెలంగాణా ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ డైరెక్టరేట్ లకు మధ్య ఫైనల్ వాలీబాల్ పోటీలను నిర్వహించమన్నారు.ఈ ఫైనల్ వాలీబాల్ పోటీలలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ మొదటి స్థానంలో నిలిచయన్నారు. బంగారు పతకాన్ని ఢిల్లీ డైరెక్టరేట్, రెండవ స్థానంలో వెండి పతకాన్ని రాజస్థాన్ డైరెక్టరేట్, మూడవ స్థానంలో రజత పతకాన్ని సాధించినట్లు క్యాంపు క్రీడా అధికారి లెఫ్టినెంట్ కల్నోల్ రాకేష్ జైశ్వాల్ తెలిపారు. ఈ రోజు శిక్షణలో భాగంగా గ్రూప్ డాన్స్ పోటీలను నిర్వహించినట్లు క్యాంప్ డిప్యూటీ కమాండ్ కల్నల్ పీ యస్ నందా పేర్కొన్నారు.

సంయుక్త శిక్షణా శిబిర కాండెట్లకి అగ్ని ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. అదేవిధంగా సంయుక్త శిక్షణా శిబింరంలోని 600 మంది కాండెట్లకు ఫైర్ ఫైటెనింగ్ అవగాహన కల్పించినట్లు వారు పేర్కొన్నారు. అకస్మాత్తుగా జరిగే అగ్ని ప్రమాదాలను మన చుట్టు గల వసతులతో మంటలని ఆర్పే పలు రకాల విధానాలను ప్రయోగ పూర్వకంగా వారికి చూపించమన్నారు. గజ్వేల్ ఫైర్ ఆఫీసర్ సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు క్యాంపు కమ్మండంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్ రావు తెలిపారు.

బంగారు తెలంగాణకు సమయం ఆసన్నమైంది

- తెలంగాణ స్టేట్ యూత్ వింగ్, ఏజెడ్ వ్యవస్థాపక అధ్యక్షులు జుబేర్ పాషా
- సీఎం కేసీఆర్ దట్టి కట్టి అనంతరం సమావేశం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్
తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని తెలంగాణ స్టేట్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు జుబేర్ పాషా అన్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గజ్వేల్ నియోజకవర్గం సమావేశానికి ఆయన హాజరయ్యారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా షామీర్ పెట్ పరిధిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో గజ్వేల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎం కేసీఆర్ హాజరయ్యే ముందు జుబేర్ పాష సీఎం కేసీఆర్ కు దట్టిని కట్టారు. దాంతో మళ్లీ అధికారంలోకి రాబోయేది బిఆర్ఎస్ పార్టీ అని జుబేరుబాషాతో సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. హరిత తెలంగాణ సంపూర్ణంగా సీఎం కేసీఆర్ సారథ్యంలో నిర్మాణం అయిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టడం ఖాయమని సీఎం కేసీఆర్ తో జుబేర్ పాష ప్రస్తావించారు. మరోసారి సీఎం కేసీఆర్ ని గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిపించుకొని బంగారు తెలంగాణకు బాటలు వేసేందుకు గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు సముఖంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షాలు లేనిపోని అపోహలు ప్రజల్లోకి తీసుకుపోయే ప్రయత్నం చేస్తున్నాయని పేర్కొన్నారు. వారి ప్రయత్నాలు నీటి మీద బుడగలాగా క్షణంలో మాయమవుతాయని సీఎం కేసీఆర్ తో అన్నారు. జుబేర్ పాష మాటలకు సీఎం కేసీఆర్ ప్రజలు అభివృద్ధి వైపే ఉన్నారని, ఆ నమ్మకం గజ్వేల్ నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు. త్వరలో గజ్వేల్ పట్టణానికి వచ్చి ప్రజల ఆశీర్వాదాన్ని పొందుతానన్నారు.

రాజగోపాలపేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ



నవతెలంగాణ-నంగునూరు
నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామంలో శుక్రవారం సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే తీరొక్క పువ్వులు తెచ్చి పోటీపడి పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చారు. ఈసారి బతుకమ్మకు తంగేడు, గునుగు పువ్వు కొరత ఉండడంతో ఎక్కువ శాతం బంతి పువ్వుల మీదనే ఆధారపడ్డారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 9వ రోజు సద్దుల బతుకమ్మ పండుగ జరుపుకుంటే రాజగోపాలపేట గ్రామంలో మాత్రం ఏడవ రోజు సద్దుల బతుకమ్మ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఉదయాన్నే మహిళలు పట్టు వస్త్రాలు ధరించి ప్రధాన వీధుల్లో ఆటపాటలతో మునిగిపోయారు. గ్రామంలో ఎటు చూసినా బతుకమ్మ పాటలతో మార్మోగించారు. బతుకమ్మ ఆటల అనంతరం పెద్ద చెరువు వద్ద బతుకమ్మలతో ర్యాలీగా వెళ్లి నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మ పండుగకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేంద్ర, ఎంపీటీసీ సుమలత చందు, ఉప్ప సర్పంచ్ మహేష్ నాయకులు, రంగురాజు గౌడ్, కమల్ షరీఫ్, పరమాండ్ల మల్లేశం, మహిళా సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

దినసరి కూలీ ఆత్మహత్య



నవతెలంగాణ-వర్గల్
అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వేలూరు గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేలూరు గ్రామానికి చెందిన కర్రె ఎల్లయ్య (48) కి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ దంపతులు ఇద్దరూ కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత 10 నెలల క్రితం ఎల్లయ్య నివాసం ఉంటున్న ఇల్లు కూలిపోవడంతో కొత్తగా ఇల్లు నిర్మించుకున్నారు. ఇల్లు నిర్మించడంతో దాదాపు రూ. 3 లక్షల అప్పు అయ్యింది. అప్పు ఎలా తీర్చాలని తరుచూ తన భార్య భాగ్యమ్మతో చెబుతూ బాధపడేవారు. అదే బాధలో కొద్ది రోజులుగా మద్యానికి బానిస అయ్యాడు. గురువారం రోజున ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన ఎల్లయ్య రాత్రి 11 వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. గ్రామ శివారులో ఉన్న రంగం చెరువు వద్ద గురువారం రోజున ఎల్లయ్యను చూసాము అని స్థానికులు చెప్పడంతో చెరువు పరిసర ప్రాంతంలో వేతకగా ఎల్లయ్య కి సంబంధించిన చెప్పులు, సెల్ ఫోన్ లభ్యమయ్యాయి. అనుమానంతో చెరువులో వేతకగా ఎల్లయ్య శవమై చెరువులో కనిపించాడు. అప్పుల బాధతోనే తన భర్త మద్యానికి బానిసై జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య భాగ్యమ్మ తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు గౌరారం ఎస్ఐ విజయ భాస్కర్ తెలిపారు.

అభివృద్ధి చేసినవారికి పట్టంకట్టాలి



- మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

నవతెలంగాణ-తొగుట
అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్ పార్టీ కే పట్టం కట్టాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వర్దరాజ్ పల్లి గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా సొసైటీ చైర్మన్ కే. హరికృష్ణ రెడ్డి, సర్పంచ్ చత్రి రాజవ్వతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో మాయ మాటలు చెప్పిన ఎమ్మెల్యే రఘునందన్ రావు పైసా పనిచేసిందేమి లేదన్నారు. మర్రికుంట రోడ్డుకు నిధులతో పాటు, సీసీ రోడ్లు, ముదిరాజ్, రెడ్డి, గౌడ సంఘం భవనాలకు నిధులు మంజూరు చేయించి, 25 డబల్ బెడ్ రూమ్‌లు పూర్తిస్థాయి నిర్మాణానికి సహకరించిన ఘనత ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కే దక్కుతుందన్నారు. ప్రతి తెల్లరేషన్ కార్డు దారులకు రూ.5 లక్ష ల బీమా సౌకర్యం, రైతు బంధు, ఆసరా, వికలాంగ పింఛిన్ పెంచడం గొప్ప విషయం అన్నారు. మొదటి నుంచి వర్దరాజ్ పల్లి గ్రామం బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, రైతు బంధు అధ్యక్షుడు బోధనం కనకయ్య, సర్పంచ్‌లు తోయేటి ఎల్లం, గంగనిగళ్ళ మల్లయ్య, సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పులి బైరయ్య, బూత్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బక్క కనకయ్య, నాయకులు సుతారి రమేష్, చెత్రి శ్రీనివాస, కనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, మైపాల్ రెడ్డి, దేవయ్య,క్రాంతి, సత్య లింగా రెడ్డి, కేశవరెడ్డి, రాజు, రాకేష్, కిషన్ పాపయ్య, గ్రామ యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మూలనక్షత్ర విశేష పూజలు

- స్వర్ణ కిరీటంతో దర్శనమిచ్చిన అమ్మవారు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి సత్యవతి రాథోడ్ , ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి
- క్షేత్రానికి విశేషంగా తరలివచ్చిన భక్తులు





నవతెలంగాణ-వర్గల్
ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మూలా నక్షత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది . తెల్లవారు జామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మూల నక్షత్ర విశేష పూజలకు అంకురార్పన చేశారు . ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, లక్ష పుష్పార్చన, చండీ హోమం, పుస్తక స్వరూపిణి సరస్వతి పూజ, చతు షష్టుపచార పూజలు, సప్తశతి పారాయణం, మూలమంత్ర హవనము తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూల నక్షతం సందర్భంగా శ్రీ విద్యా సరస్వతి మాత స్వర్ణ కిరీటంతో భక్తులకు దివ్యదర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగగా, ఈ కార్యక్రమాల్లో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి, శ్రీ గురుమదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి, శ్రీ క్షేత్రం పీఠాధిపతి శ్రీ మధుసూదనానంద సరస్వతి స్వామి, మంత్రి సత్యవతి రాథోడ్ , ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. అలాగే వేలాదిగా తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు .

ఆధారాలు లేని డబ్బు రూ.2.35 లక్షలు స్వాధీనం



నవతెలంగాణ-అక్కన్నపేట
సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం ఎస్ఐ తాండ్ర వివేక్ వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తుల దగ్గర ఆధారాలు లేని డబ్బు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఎఫ్ ఎస్ టి ఇంచార్జ్ దేవేంద్రకు సమాచారం అందించడంతో వెంటనే ఆమె అక్కడికి చేరుకొని పంచనామ నిర్వహించి డబ్బు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ లో అప్పగించామని తెలియజేశారు. ఇట్టి డబ్బు మచ్చ బాలయ్య 1.15లక్షలు, సుక్కల ఆంజనేయులు రూ. 88,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బుకు సరైన ఆధారాలు ఉంటే కలెక్టరేట్ లో నిర్ధారణ చేసుకొని డబ్బులను తీసుకుపోవచ్చు దేవేంద్ర తెలియజేశారు. వీరితో పాటు పోలీస్ సిబ్బంది కూడా ఉన్నారు.

ప్రజలందరికీ దుర్గాదేవి ఆశీస్సులు ఉండాలి

- వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ ఫోరమ్ అధ్యక్షుడు



నవతెలంగాణ-తొగుట
ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ ఫోరమ్ అధ్యక్షుడు కంకణాల నర్సింలు అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పబడిన దుర్గా మాత అమ్మవారి దగ్గర మండల ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షులు కంకణాల నర్సింలు ముదిరాజ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ వేల్పుల స్వామి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. విగ్రహదాత మిద్దె రాజు, అన్నదాత కంకణాల నర్సింలు ముదిరాజ్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, సభ్యులు మిద్దె సంతోష్, నాగులపల్లి నర్సింలు, పిట్ల ఆంజనేయులు, కంకణాల బాలకృష్ణ, మిద్దె భాస్కర్, మిద్దె మహేష్, బెజ్జన మైన ప్రశాంత్, నాగులపల్లి అనిల్, సూతరి శ్రీనివాస్, తిప్పరమైన స్వామి, పిట్ల స్వామి, రామస్వామి,సురేష్ తదితరులు పాల్గొన్నారు

సద్దుల బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-చిన్నకోడూరు
ప్రకృతి ఒడిలో ఉదయించే పూలను అలంకరించి వాటిని భక్తి శ్రద్ధలతో పూజించి జరుపుకునే పండుగ బతుకమ్మ అని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నకోడూరు మండలంలోని కొన్ని గ్రామాల్లో 7రోజులలో సద్దుల బతుకమ్మ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అనీ, దీంతో ఉదయమే మహిళలు, చిన్నారులు పువ్వులను తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పేర్చి అందరూ ఒకచోట చేరి బతుకమ్మ పాటలతో, సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైనా బతుకమ్మ ను ఆటపాటలతో సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా జరుపుకుంటారని అన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకైన బతుకమ్మ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్న మండల ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలతో పాటు ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దసరా పండుగ అందరి జీవితాల్లో ఆనందాలు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఘనంగా కుంకుమార్చన



నవతెలంగాణ-చేర్యాల
చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని శ్రీ భవానీ రుద్రేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉల్లెంగల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది మహిళలు పాల్గొనగా వారికి సేవా ట్రస్ట్ నిర్వాకులు కుంకుమార్చన పూజా సామాగ్రిని అందజేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల ఏకానందం, మాజీ జెడ్పిటీసీ ఉళ్ళెంగల పద్మ, ఎఎంసీ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్ తాటికొండ సదానందం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పాల బాలరాజు, రణం ప్రశాంత్, పుప్పాల మహేందర్, పోరండ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శనివారం | 21 అక్టోబర్ 2023 | www.navatelangana.com

మొదటి రకం ధాన్యం మద్దతు ధర రూ.2203

- జిల్లా మార్కెటింగ్ డీపీఎం కరుణాకర్
- వరిధాన్యం కొనుగోళ్లకు శిక్షణ



నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలోని అయా గ్రామాల్లో ఐకేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వరిధాన్యం కొనుగోల కేంద్రాల్లో మొదటి రకం వరిధాన్యానికి రూ.2203 మద్దతు ధర నిర్ణయించినట్టు జిల్లా మార్కెటింగ్ డీపీఎం కరుణాకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యలయంలో అయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఐకేపీ అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సాధారణ రకం వరిధాన్యానికి రూ.2183 మద్దతు ధర నిర్ణయించినట్టు డీపీఎం తెలిపారు. డీపీఎం విద్యాసాగర్, తహసిల్దార్ శ్యాం, ఏఓ సంతోష్, ఏపీఎం నర్సయ్య, సీసీలు పద్మ, సారయ్య, తిరుపతి, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు హజరయ్యారు.

అనుమతుల్లేని ప్రచార అస్త్రాల తొలగింపు





నవతెలంగాణ-బెజ్జంకి

ఎన్నికల అధికారుల అనుమతుల్లేకుండా పలువురి నివాస గృహల గోడలపై అయా రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రచార్థాం వినియోగించిన ప్రచార అస్త్రాలను శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుల్లో ఉండడంతో సంబంధిత ఎన్నికల అధికారి అనుమతుల మేరకే అయా పార్టీల ప్రచార అస్త్రాలు వినియోగించాలని అనుమతుల్లేని సంబధిత గృహ యాజమానులపై చట్టపరమైన చర్యలు చేపడుతామని పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి తెలిపారు.

దుబ్బాక జనం గుండెలో 'కొత్త'

- నిత్యం పల్లె బాట ప్రజలతో పలకరింపులు
- అభివృద్ధిపై ప్రత్యేక ఫోకస్, మోడల్ దుబ్బాక లక్ష్యంగా అడుగులు
- సీఎం కేసీఆర్ తో సన్నిహిత సంబంధాలు, మంత్రికి నమ్మినబంటు
- దుబ్బాక తలరాత మారుస్తా.. ఒక్క ఛాన్స్ ఇవండి
- ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి





నవతెలంగాణ-మిరుదొడ్డి

దుబ్బాక నియోజకవర్గంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తనదైన శైలిలో పర్యటిస్తూ ప్రజల గుండెలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. నిత్యం ప్రజలో ఉంటూ సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడిగా, మంత్రి హరీష్ రావుకు నమ్మినబంటుగా ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి పనిచేస్తూ ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు. రానున్న ఎన్నికల్లో దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఎంపి , బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి పై నవ తెలంగాణ ప్రత్యేక కథనం...

దుబ్బాక మండలం పోతారం గ్రామానికి చెందిన కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాపారరీత్యా హైదరాబాదులో స్థిరపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ తెలంగాణ ప్రత్యేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ సమయంలోనే సీఎం కేసీఆర్‌కు కొత్త ప్రభాకర్ రెడ్డి సన్నిహితగా మారాడు. కొత్త ప్రభాకర్ రెడ్డికి సీఎం కేసీఆర్ మెదక్ ఎంపీగా అవకాశమిచ్చారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌పై రెండు పరియాలు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఘనవిజయం సాధించి జనం గుండెల్లో నిలిచిపోయారు. తెలంగాణ వాదాన్ని పార్లమెంటులో నినదించారు. ప్రస్తుతం తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వైఖరికి నిరసనగా పార్లమెంటు సమావేశంలో తమ గళాన్ని వినిపిస్తూనే ఉన్నారు. దుబ్బాక ఉద్యమ నేత ఎమ్మెల్యే స్వర్గీయ సోలిపేట రామలింగారెడ్డి మరణం అనంతరం దుబ్బాక బాధ్యతలు కొత్త ప్రభాకర్ రెడ్డికి అప్పగించారు. అప్పటినుండి కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి మార్గదర్శకులుగా పనిచేస్తూ జనం గుండెల్లో కొత్త ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల కొత్త ప్రభాకర్ రెడ్డిని దుబ్బాక టీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించారు. అప్పటినుండి కొత్త ప్రభాకర్ రెడ్డి నియోజకవర్గంలోని ప్రతిరోజు పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేస్తూ అభివృద్ధి పనులపై ఆరాధిస్తూ అన్ని వర్గాల ప్రజలకు దగ్గరవుతున్నారు. ఇటీవల అన్ని గ్రామాల్లో కుల కమ్యూనిటీ భవనాల కు నిధులు మంజూరు చేయించారు. సొంత గడ్డపై కొత్త అడ్డ నిర్మాత్మకంగా వేసుకునే దిశగా కొత్త అడుగులు వేస్తున్నారు. దుబ్బాక జనం కూడా కొత్త ప్రభాకర్ రెడ్డిని కోరుకుంటున్నారు.

సీఎం కేసీఆర్‌కు సన్నిహితులుగా...

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి రెండు పర్యాలు కొత్త ప్రభాకర్ రెడ్డి ఎంపీగా గెలుపొందడంతో సీమ కేసీఆర్‌కు మరింత సన్నిహితంగా మారారు. ప్రతి విషయంపై కేసీఆర్‌తో చర్చించే స్థాయికి చేరుకున్నారు. అలాగే రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావుకు నమ్మిన బంటుగా కొత్త ప్రభాకర్ రెడ్డి పేరుగాంచారు. ప్రజల వద్దకు కొత్త ప్రతినిత్యం వెళుతూ తమ సాధక బాధలు తెలుసుకొని ఆర్థికంగా చేయూతనందిస్తున్నారు. సొంత పార్టీలో అసంతృప్తి లేకుండా చూస్తున్నారు. ఇతర పార్టీల నుంచి బిఆర్ఎస్ లోకి చేర్చుకునేందుకు అడుగులు వేస్తున్నారు.

దుబ్బాక దశ మారుస్తా: కొత్త ప్రభాకర్ రెడ్డి

రాష్ట్రంలోనే దుబ్బాకను మోడల్‌గా మార్చడమే తన లక్ష్యమని దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. దుబ్బాకలో అన్ని రకాలుగా సేవలు అందించడానికి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలోని మట్టి రోడ్లను బీటీ రోల్‌గా మార్చడం, సింగిల్ రోడ్లను డబల్ రోడ్డు గా మార్చడం తమ లక్ష్యమన్నారు. గ్రామాలను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి నిరంతర శ్రామికుడిగా పనిచేస్తానని ప్రకటించారు.

ధాన్యం సేకరణ సాఫీగా సాగాలి

- అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) పి.శ్రీనివాస్‌రెడ్డి





నవతెలంగాణ-సిద్ధిపేట కలెక్టరేట్

వానాకాలం ధాన్యం సేకరణ ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా సాఫీగా నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) పి. శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులు, మిల్లర్ల ప్రతినిధులతో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. 'జిల్లాలో ఈ ఖరీఫ్‌లో సుమారు 3.78 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేయడం జరిగింది. జిల్లాలో 420 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించడానికి రైతులకు అవగాహన కల్పించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో మంచినీటి సదుపాయం, నీడ, తాత్కాలిక మరుగుదొడ్డి, కరెంటు మొదలగు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మేనేజర్ హరీష్, జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ , జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ జిల్లా రవాణా అధికారి జనార్దన్ రెడ్డి , జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు , మెప్మా అధికారి హన్మంత రెడ్డి పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-మద్దూరు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సిద్ధిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మద్దూరు మండల కేంద్రం లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి అధిక లాభాలు పొందాలని ఆయన కోరారు. రైతులు కోసిన పంటను తమ కళ్ళల వద్దనే ఆరబెట్టుకుని తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డి సి ఎస్ తనుజ, డి ఆర్ డి ఎ పి డి జయదేవ్, డీఎంవో హర్ష, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, డి పి ఎం లు కరుణాకర్, విద్యాసాగర్, మద్దూరు తహసిల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్, ఏపీఎం బాబురావు, సీసీలు ప్రేమలత, సిద్ధి మల్లయ్య, మహేందర్, క్రాంతి వివో సభ్యులు గొట్టే కనక లక్ష్మి ,బంటు లక్ష్మి, సుజాత, పాల్గొన్నారు.

మంత్రి హరీష్ అహంకారానికి.. మెదక్ పౌరుషానికి మధ్య పోరు

- రాష్ట్రంలో, మెదక్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం
- మెదక్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనపల్లి రోహిత్ రావు



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు అహంకారానికి మెదక్ జిల్లా ప్రజల పౌరుషానికి మధ్య పోరులో ప్రజలు, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా తాను ఘన విజయం సాధించడం ఖాయమని మెదక్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ గంగాపూర్, శమ్నాపూర్, కొచ్చేరువు తండా, స్కూల్ తండా, లింగసాన్పల్లి తండా తదితర గ్రామపంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మైనంపల్లి హనుమంతరావు గ్రామాలలో సేవా కార్యక్రమాలు తప్ప అభివృద్ధి ఏ గ్రామంలో కనిపించడం లేదన్నారు. తొమ్మిది సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ పరిపాలించిన గ్రామాలలో ఇప్పటివరకు గుడిసెలే ఉన్నాయన్నారు. పేదవాళ్ల బతుకు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు మైనంపల్లి సోషల్ సర్వీస్ తరపున ప్రతి గ్రామానికి ఎంతో కొంత సహాయ సహకారాలు అందించామని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరాలు తీర్చేందుకు బోరుబావులు, మోటార్లు అందజేశామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ మాటలు నమ్మవద్దని ప్రజలను కోరారు. తనపై నమ్మకం ఉంచి తనను అభ్యర్థిగా నిలబెట్టడం మీ అందరి ఆధారాభిమానాలేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో మెదక్ నియోజకవర్గంలో చేసి చూపిస్తానన్నారు. మాటలు కాదని చేతలతో అభివృద్ధి పనులు గ్రామాల్లో చేసి చూపెడతానన్నారు. ఈ కార్యక్రమంలో సర్దన సర్పంచ్ సుభాష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మండల పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, కిషన్ గౌడ్, పరశురామ్ గౌడ్, మోల్ సాబ్, వెంకన్న, అక్బర్, మాణిక్యం , స్వామి నాయక్, మల్లారెడ్డి, ప్రభాకర్ గౌడ్, శోభ, ఉప సర్పంచ్ రామచంద్రరావు, శ్రీశైలం, రాజశేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సిద్ధిరామిరెడ్డి, సంజీవులు, మొండి పద్మారావు, సూర్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని నలాక్ పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బియ్య రమేష్ ఎమ్మెల్సీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి, సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు, ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం, ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బియ్య రమేష్‌తో పాటు 50 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పల్లా రాజేశ్వర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాడని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమం కోసమే బిఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచి మూడోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుర్ఘ ఐలయ్య ఉపసర్పంచ్ శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

నవంబర్ 5న మాదిగల యుద్ధభేరి సభ



నవతెలంగాణ-నంగునూరు

నవంబర్ 5న హైదరాబాద్‌లో జరిగే మాదిగల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాల నరసింహులు పిలుపు నిచ్చారు. శుక్రవారం నంగునూరు మండల కేంద్రంలో మాదిగల యుద్ధభేరి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత సామాజిక న్యాయం జరగాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ పక్షాన డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయాలనీ ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, మాదిగ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేశామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం డప్పు, చెప్పుదారులకు తక్షణమే నాలువేల రూపాయాల పింఛన్ ప్రకటించాలన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని మాట ఇచ్చిన బీజేపీ మరోసారి మాదిగలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందికట్ల కిషన్, గండిపల్లి సంతు, నాగిల్ల రవీందర్, దేవులపల్లి మల్లయ్య, దేవులపల్లి ఇస్తారి, కందికట్ల సామేల్, దమ్మ గళ్ళ బిక్షపతి, దేవులపల్లి నితిన్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ తిరిగి స్వాధీనం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా కనుక్కొని బాధితునికి తిరిగి అప్పగించామని గజ్వేల్ ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. శుక్రవారం బేగంపేట పోలీస్ స్టేషన్ లో బాధితునికి మొబైల్ అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ ఎం. రమేష్ మాట్లాడుతూ చేగుంటకు చెందిన పవర్ సుభాష్ సీసీటీవీ పని నిమిత్తం బేగంపేట్ గ్రామానికి వచ్చారన్నారు. పనిలో బిజీగా ఉన్న సుభాష్ తన ఫోన్ పోగొట్టుకున్నాడని పేర్కొన్నారు. తన ఫోన్ పోయిందని బేగంపేట పోలీస్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన %ఙఙ.ఙవఱఙ.స్రఙఙ.ఙఙ% అనే వెబ్సైట్లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్ ను ఎంటర్ చేసి, బ్లాక్ చేశారన్నారు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం వచ్చిందన్నారు. ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్ స్వాధీనం చేసుకుని, పోగొట్టుకున్న వ్యక్తికి బేగంపేట పోలీస్ స్టేషన్ లో బాధితునికి అప్పగించడం జరిగిందన్నారు. ఈ పోర్టల్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తొగుట సిఐ కమలాకర్, బేగంపేట ఎస్సై అరుణ్ పాల్గొన్నారు.

ఎన్నికల బరిలోకి ధర్మ సమాజ్ పార్టీ



నవతెలంగాణ-సిద్దిపేట: తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మత, మైనారిటీల రాజ్య స్థాపనే లక్ష్యంగా తెలంగాణలో 119 నియోజకవర్గాలలో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థులను ఎన్నికల బరిలోకి నిలుపుతుందని సిద్దిపేట నియోజకవర్గ అభ్యర్థిగా కర్రోల్ల బాబు తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను సిద్దిపేట నియోజకవర్గ అభ్యర్థిగా నిర్ణయించినం దుకు ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో 10 శాతం లేని అగ్రకులాల ఆధిపత్యం పై 90 శాతం అనగారిన వర్గాల ప్రజల తరపున ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధం పేరుతో ఎన్నికల బరిలోకి దిగుతుందని అన్నారు. మీ అమూల్యమైన ఓటును టార్చ్ లైట్ (బ్యాటరీ టార్చ్) గుర్తుపై వేసి నన్ను ఆశీర్వదించి, మన ధర్మ సమాజ్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు డి.బి. రాజ్, దుబ్బాక నియోజకవర్గం అభ్యర్థి ప్రసన్న, సురేష్, జ్యోతి, సుమన్, సిద్దు, బాబురావు, జోసెఫ్, బాబు పాల్గొన్నారు.

ప్రజ్ఞాపూర్ దుర్గామాతకు ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

మండల కేంద్రంలోని రామాలయం దుర్గామాత మండపం వద్ద కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు అర్ధం సంతోష్ కుమార్, అర్ధం మహేష్ కుమార్, లింగం యాదవ్, వడ్డేపల్లి ప్రసాద్, దీకొండ కైలాసం శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ క్షత్రియ రామజోగి సంఘం వారి సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 400 మందికి అన్నదాన చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ శ్రీ క్షత్రియ రామ జోగి సంఘం అధ్యక్షుడు గుజ్జేటి వెంకటేశం, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కురుమలు విద్యారంగంలో రాణించాలి



నవతెలంగాణ-మద్దూరు

కురుమలు విద్యారంగంలో రాణించాలని దూల్మిట్ట మండల కురుమ సంఘం అధ్యక్షుడు బర్మా రాజ మల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో కురుమ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతిలో ప్రతిభ సాధించిన కురుమ విద్యార్థులకు ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కోరే ఎల్లయ్య ఘనంగా సన్మానం చేశారు. 50 మంది విద్యార్థులకు ఉద్యోగాలు పొందిన వారికి నూతనంగా సన్మానించారు. కార్యక్రమంలో కురుమ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొలుపుల రాములు ప్రధాన కార్యదర్శి స్వామి, తదితరులు పాల్గొన్నారు

జాలపల్లి ముదిరాజ్ గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు ముదిరాజ్ మహాసభ సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి సాగర్ శుక్రవారం విలేకరులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాలపల్లి మహాసభ ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడిగా పోతిరెడ్డి శ్రీనివాస్ మత్స్య శాఖ అధ్యక్షులు గొడుగు జంపన్న ప్రధాన కార్యదర్శి తుపాకుల యాదగిరి, ఉపాధ్యక్షులు పోతిరెడ్డి రమేష్, డైరెక్టర్లు పోతిరెడ్డి ఇస్తారు, డైరెక్టర్ చొప్పరి సంపత్, పోతిరెడ్డి యాదగిరి, గొడుగు చంద్రయ్య,పాలెటీ కనకయ్య, లను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు

దేవి మండపంలో అన్నదానం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలోని నల్ల పోచమ్మ రోడ్డులో గల దేవి నవరాత్రోత్సవ మండపం వద్ద శుక్రవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు ఉచిత బస్సు పాసుల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేటలోని 18వ వార్డులోనీ లైన్స్ క్లబు లో మానసిక వికలాంగులకు ఉచిత బస్సు పాసులు బస్ డిపో అధికారిని మహేశ్వరితో కలిసి అందించినట్లు 18వ వార్డు బిఆర్ఎస్ నాయకులు అడ్డగట్ల శేఖర్, అంజీలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మా వంతువారికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతుగా పేదలకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు గంప రమేష్ , జ్యోతి, జోజీ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిలో ఇసుక అక్రమ రవాణా

- ట్రాక్టర్లను పట్టుకున్న హుస్నాబాద్ ఎస్సై మహేష్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ఇసుక మాఫియా ట్రాక్టర్‌లలో ఇష్టరాజ్యాంగా తరలిస్తూ అమ్ముకుంటున్నారు. ఇసుకను అక్రమంగా తరలింపు అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో తోటపల్లిలో ఇసుక రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. తోటపల్లి వాగు నుండి శుక్రవారం అక్రమ తరలిస్తున్న ట్రాక్టర్లను హుస్నాబాద్ పోలీసులు పట్టుకున్నారు. తోటపల్లి వాగులో ట్రాక్టర్ లలో ఇసుక నింపుతున్న క్రమంలో సమాచారం తెలుసుకున్న పోలీసులకు సంఘటన స్థలానికి వెళ్లారు. వాగులో ఇసుక నింపి ఉన్న ఐదు ట్రాక్టర్ల ను గుర్తించి, ట్రాక్టర్ల వివరాలను పోలీసులు సేకరించారు. అక్రమ ఇసుక రవాణా తరలింపు పై సమాచారం రావడంతో ట్రాక్టర్లను పట్టుకున్నట్లుగా ఎస్ఐ మహేష్ తెలిపారు.